## గాంధీజీ ఆశయాలను విస్తృతంగా ప్రచారం చేయాలి : పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

**నాంపల్లి, నవంబరు 12 ప్రభాతవార్త :** జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను, ప్రభోదాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న తెలంగాణ రాష్ట్ర పీసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేష్‌కుమార్ గాంధీబాట వాహన ప్రచారయాత్రను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. గాంధీజ్ఞాన్ ప్రతిష్టాన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని నాంపల్లిలో ప్రచార వాహనానికి పూలమాలవేసి గుమ్మడికాయ కొట్టి వేదమంత్రోచ్ఛారణల మధ్య పూజలు నిర్వహించి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఎంతో సంకల్పం, ఉద్దేశంలో నిర్వాహకులు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రశంసించారు. ముఖ్యంగా గాంధీజీ ఆశయాలైన శాంతి, సామరస్యం, సద్భావన, సౌభ్రాతృత్వం ప్రజల వద్దకు తీసుకెళ్లే దిశగా రాష్ట్రవ్యాప్తంగా అనేక మండలాలు, గ్రామాలగుండా ప్రయాణిస్తూ గాంధీబాట వాహన ప్రచారం సాగుతుందని నిర్వాహక సంస్థల ఉపాధ్యక్షుడు యానాల ప్రభాకర్‌రెడ్డి, గాంధీ విజ్ఞాన కేంద్రా ల కమిటీ కన్వీనర్ గాంధారి ప్రభాకర్‌లు వెల్లడించారు. గాంధీజీ కన్నకలలు సాకారం చేయడమే తమ ప్రధానలక్ష్యమని, ఈ సదుద్దేశానికి ప్రజలు సహకరించి సఫలీకృతం చేస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో కాల్వ సుజాత, దీపక్, వేణుగోపాల్, దయాకర్‌రెడ్డి, సుభాష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.


గాంధీబాట ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రచారాన్ని ప్రారంభిస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, వేణుగోపాల్ తదితర ప్రముఖులు



హైదరాబాద్ వార్త

# పోలింగ్ శాతం ఎందుకు పడిపోతుంది.!

## యాబై శాతం దాటని జూబ్లీ పోలింగ్ · పదేళ్లలో పడిపోయిన పోలింగ్ శాతం

**జూబ్లీహిల్స్, నవంబరు 12, ప్రభాతవార్త:**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్ శాతం ఈ సారి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అదే సమయంలో బీహార్‌లో జరిగిన ఎన్నికల పోలింగ్ శాతంతో పోల్చుకుంటే మరి దారుణంగా ఉంది. నిర్లక్ష్యరాస్యులుగా, వెనుకబడిన ప్రాంతంగా గుర్తింపు పొందిన బీహార్‌లో మంగళవారం జరిగిన రెండో విడత ఎన్నికల్లో బీహారీలు ఆసక్తి చూపారు. సెలవు ఇచ్చి, చైతన్య వేదికలు, కార్యక్రమాలు నిర్వహించినా జూబ్లీహిల్స్ ఓటర్లు మాత్రం గడప దాటలేదు.. రెండు గంటలకు 10 శాతం మేర పోలింగ్ నమోదవ్వగా చివరి మూడు గంటల్లో కేవలం 8.49 పోలింగ్ శాతం నమోదవ్వడం జూబ్లీ ఓటరు తీరును తెలియజేపస్తుంది. బీహార్‌లో పోలింగ్ కేంద్రాలు ఓటర్లతో ఉత్సాహంగా లైన్లలో నిలబడి కనిపిస్తే, హైదరాబాద్ నడినగరంలో ఉన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇంతటి ప్రచారం, రాజకీయ ప్రభావం ఉన్నా ఉప ఎన్నికల్లో నిరాశపరిచేలా పోలింగ్ శాతం ఉండటం ఆశ్చర్యానికి గురిచేస్తుంది.. దాదాపు 4 లక్షలకు పైగా ఓటర్లు ఉన్న ఈ నియోజకవర్గంలో యాబై శాతానికి లోపే పోలింగ్ శాతం నమోదవ్వడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. దీనికితోడు జూబ్లీ ఉప ఎన్నికల్లో ఉదయం 9 గంటలకు 10.02 శాతం, 11 గంటలకు 20.76 శాతం, 1 గంటకు 31.94 శాతం, 3 గంటలకు 40.20 పోలింగ్ శాతం నమోదైంది. ఇక చివరి మూడు గంటల్లో అంటే 3 గంటల నుంచి 6 గంటల వరకు కేవలం 8.49 శాతం పోలింగ్ నమోదవ్వడం గమనార్హం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మొత్తం 4,01,365 ఓట్లు ఉండగా అందులో పురుషుల ఓట్లు 99771, మహిళల ఓట్లు 94855 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 194631 ఓట్లు ఈ ఎన్నికల్లో నమోదయ్యాయి.

### వలసదారులతోనేనా..!

జూబ్లీహిల్స్‌లో దాదాపు 4 లక్షలకుపైగా ఓటర్లున్నారు. మొత్తం 130 పోలింగ్ బూత్‌లలో 409 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అధికారులు అనేక ప్రయత్నాలు చేశారు. ఇందులో భాగంగానే ఓటరు చైతన్య ర్యాలీలు, సదస్సులు, సమావేశాలు నిర్వహించారు. దీనికి తోడు ఓటరును ఆకర్షించేందుకు ఓట్ ఫర్ ష్యూర్ పేరుతో ప్రచారాన్ని నిర్వహించడమే కాకుండా సోషల్ మీడియా వేదికగా అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో ఓటర్లు పెరుగుతున్నారే తప్ప పోలింగ్ శాతం మాత్రం పెరగడం లేదు. గత మూడు అసెంబ్లీ ఎన్నికలలో గమనిస్తే ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు పడిపోతుంది. కేవలం 2014లో జరిగిన ఎన్నికల్లో పోలింగ్ శాతం 56.85 నమోదైంది. ఆ ఎన్నికల్లో మొత్తం 1,65,368 ఓట్లు పోలయ్యాయి. ఇక 2018 ఎన్నికల్లో గమనిస్తే మొత్తం 1,54,148 ఓట్లు పోలవ్వగా 47.2 పోలింగ్ శాతం నమోదైంది. గత అసెంబ్లీ ఎన్నిక లు జరిగిన 2023లో 1,83,337 ఓట్లు నమోదవ్వగా 47.58 పోలింగ్ శాతం నమోదైంది. తాజాగా జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మంగళవారం 48.49 శాతం పోలింగ్ నమోదైంది. ఒకవైపు పోలింగ్ శాతాన్ని పెంచడానికి ఎన్నికల అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా 50 శాతానికి మించి పోలింగ్ నమోదవ్వకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉన్న ఏడు డివిజన్లలలో చాలా మేర బస్తీలు ఉన్నాయి. బోరబండ, రహ్మత్‌నగర్, ఎర్రగడ్డ, షేక్‌పేట డివిజన్లలో ఎక్కువగా బస్తీలు ఉన్నాయి. ఇక్కడ వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారితోపాటు బస్తీవాసుల సంఖ్య, కార్మికుల, కర్షకుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అలాగే యూసుఫ్‌గూడ, సోమాజీగూడ, వెంగళ్‌రావు నగర్ డివిజన్ ప్రాంతాలు బస్తీలతోపాటు మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా ఉంటారు. అయితే ఇక్కడ ఎక్కువ వలస ప్రాంతానికి చెందిన వారు ఉండటంతో వారు ఇక్కడ ఓటరుగా నమోదు చేసుకొంటారు. అలాగే రాష్ట్రంతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి ఇక్కడికి ఉన్నత విద్యను అభ్యసించడానికి, కంప్యూటర్ పాఠాలు నేర్చుకోవడానికి ఎక్కువ మంది విద్యార్థులు వస్తుంటారు. దీనికితోడు సాఫ్ట్‌వేర్ తదితర రంగాల్లో పనిచేయడానికి ఉద్యోగులు వస్తుంటారు. అయితే వీరు ఓటరుగా నమోదు చేసుకున్నప్పటికి ఓటు వేసే సమయానికి ఉద్యోగాలకు వెళ్లడం, పనులకు వెళ్లడం కారణంగా ఓటు వేయడానికి ఎక్కువగా రావడం లేదని అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా ఓటు ఉన్న చాలా మంది వలసదారులు ఇక్కడి నుంచి మరో రాష్ట్రానికి తరలివెళ్తుండటం వల్ల సైతం ఓటరు సంఖ్య ఏడాదికేడాది పెరుగుతుందని అంటున్నారు. వాస్తవంగా నియోజకవర్గంలో ఓటరు నమోదు ప్రకారం చూస్తూ 4లక్షలకుపైగా ఓటర్లు ఉన్నట్లు నమోదైనప్పటికి నియోజకవర్గంలో ఉండే ఓటర్ల సంఖ్య దాదాపుగా 3 లక్షల మేర ఉండవచ్చని అధికారులు అభిప్రాయడుతున్నారు.


లైనులో నిలబడిన ఓటర్లు (ఫైల్‌ఫోటో)

### జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా..

జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో పోలింగ్ శాతాన్ని సాయంత్రం 5 గంటల వరకు పరిశీలిస్తే జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యదికగా పోలింగ్ శాతం నమోదైంది. జూబ్లీహిల్స్, మధురానగర్, పంజాగుట్ట, బోరబండ, మధురానగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇందులో బోరబండ పరిధిలో ఉనన పోలింగ్ బూత్‌లలో మొత్తం 149325 ఓట్లు ఉండగా 79017 ఓట్లు పోలయ్యాయి. 52.9ఓటు శాతం నమోదైంది. అలాగే పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో 23764 మంది ఓటర్లు ఉండగా అందులో 19365 మంది ఓటర్లు ఓట్లు వేశారు. దాదాపు 81.4 ఓటింగ్ శాతం ఇక్కడ నమోదైంది. ఇక మధురానగర్‌ను రెండు భాగాలుగా చేయగా అందులో ఒకదానిలో 65965 ఓటర్లకుగాను 46127 మంది ఓటర్లు ఓటు వేయడంతో ఇక్కడ 69.9 ఓటు శాతం నమోదైంది. మరో దానిలో 16163 మంది ఓటర్లు ఉండగా అందులో 11518 మంది ఓటర్లు ఓటేయడంతో 69.3 ఓటు శాతం నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేసన్ పరిధిలో మొత్తం 27403 మంది ఓటర్లు ఉండగా 25052 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ అత్యధికంగా 91.4 ఓటు శాతం నమోదైంది. ఇదంతా సాయంత్రం 5 గంటల వరకు నమోదైన పోలింగ్ శాతం.

## నగరంలో హై అలర్ట్ ..

**-బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, షాపింగ్‌మాల్స్‌లల్లో ముమ్మర తనిఖీలు**

**-అనుమానిత వ్యక్తుల సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి**



**హైదరాబాద్, నవంబర్ 12,ప్రభాతవార్త:**
దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద బాంబు పేలుళ్ల నేపథ్యంలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. బుధవారం నగరంలోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాల్స్‌తో పాటు రద్దీ ప్రాంతాల్లో బాంబు, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్నారు. అనుమానిత వ్యక్తులపై సమాచారం అందించాలని ప్రజలను పోలీసులు అప్రమత్తం చేస్తున్నారు. ఎక్కడ ఉగ్రదాడులు జరిగినా వాటి మూలాలు హైదరాబాద్ నగరంలో ఉంటున్నాయి. నగరంలో విధ్వంస చర్యలు తగ్గినా.. ఎన్ఐఏ, వివిధ రాష్ట్రాల పోలీసుల సోదాల్లో నగరానికి చెందిన వ్యక్తులు పట్టుబడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా గుజరాత్ ఏటీఎస్ పోలీసులు ఉగ్రమూలాలు కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఇందులో రాజేంద్రనగర్‌కు చెందిన డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్ ఉన్న విషయం విదితమే. ఈనేపథ్యంలో రాష్ట్ర పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు.

## వయోవృద్ధుల క్రీడలను విజయవంతంగా నిర్వహించాలి

**-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి**


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్,నవంబర్ 12,ప్రభాతవార్త:**
జిల్లాలో నిర్వహించనున్న వయోవృద్ధుల క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో 12 నుంచి 19 వ తేదీ వరకు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలకు సంబంధించిన పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వృద్ధాశ్రమాలలో వృద్దులకు సాంస్కృతిక కార్యక్రమాలు, పలు రకాల క్రీడా పోటీల నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 19 వరకు నిర్వహించే కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమాన్ని 19న రవీంద్ర భారతిలో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధుల శాఖ సహాయ సంచాలకులు రాజేందర్, కమిటీ సభ్యులు సత్యనారాయణ రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఫలితాలపై పందెం.!

**-లక్షల్లో సాగుతున్న బెట్టింగులు**

**-గెలుపు ఓటములు, మెజారిటీలపైనే..**

**హైదరాబాద్, నవంబర్ 12,ప్రభాతవార్త:**
నగరంలోని ఖైరతాబాద్ ప్రాంతంలోని ఓ ఇరానీ కేఫ్‌లో బుధవారం మధ్యాహ్నం సమయంలో రెండు ప్రధాన పార్టీలకు చెందిన నలుగురు కలుసుకున్నారు. ఇందులో ఇద్దరు మొన్నటివరకు జూబ్లీహిల్స్‌లో వారికి అనుకూలంగా ఉన్నపార్టీల తరపున ప్రచారం చేశారు. ఓటర్లకు కలుసుకుని తమ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించడంతో ఆఓటర్లు తమవైపు ఉంటారని భావించారు. ఇక గెలుపు తథ్యమని ఆఇద్దరిలోనూ ధీమా కనిపించింది. మా పార్టీ అభ్యర్థి గెలుస్తారని ఒకరు అంటే.. లేదులేదు నేనే మద్దతిచ్చి అభ్యర్థి విజయం సాధిస్తారని మరొకరు చెప్పారు. ఇద్దరి మధ్య దాదాపు అరగంట పాటు గెలుపోటములపై చర్చించారు. చివరకు బెట్టింగు చేద్దామా అంటూ ఒకరు చెప్పడంతో సరే..ఎంత బెట్టు అని ఎదుటి వ్యక్తి అన్నారు. నీవెంతంటే..నేనంత పెడ్తా అంటూ ఆవ్యక్తి చెప్పాడు. సరే రూ.50వేలు పందెం. రేపు ఎన్నికల ఫలితాలు వెల్లడైన వెంటనే డబ్బులు ఇవ్వాల్సిందే..అంటూ అక్కడున్న మరో ఇద్దరు అంగీకారంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇలా నగరంలో చాలా ప్రాంతాల్లో బెట్టింగ్‌లు జోరుగా సాగుతునా న్నయి. గెలు పోటముల అంచనాల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ అభ్యర్థులు కూడికలు తీసివేతల్లో నిమగ్నమై ఉంటే..మరోవైపుబెట్టింగులు జోరందుకున్నాయి.

### సర్వేల ఆధారంగా..

ఉప ఎన్నికల్లో పోరు నువ్వా..నేనా అన్నట్లు ఉండటం,గెలుపోటములపై ఓటరు గుట్టువిప్పకపోవడంతో ఇక గత్యంతరం లేక వివిధ న్యూస్ ఛానళ్లలో వస్తున్న సర్వేల ఆధారం చేసుకుని బెట్టింగులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. ఇలా గెలుపోటములతో పాటు మెజార్టీపైనే పందెం కాస్తున్నారు. ఒకరు 10వేల ఆధిక్యంతో గెలుపొందుతారని.. మరొకరు 5వేల ఓట్లలోపు ఉంటుందని,ఇంకొకరు 2వేల కంటే ఎక్కువగా రావని..ఇలా రకరకాల బెట్టింగులు వేస్తున్నారు. పార్టీల అభ్యర్థులు సైతం ముందస్తుగా,మెజార్టీలు ప్రకటించడం,సంబరాలు చేసుకోవడం వంటివి చూడటం,సామాజిక మాధ్యమాల్లోనూ అభ్యర్థుల గెలుపోటములపై సర్వేలు రావడంతో చాలా బెట్టింగు చేస్తున్నారు. క్రికెట్ బెట్టింగ్‌ల మాదిరిగా ఎన్నికల్లో అభ్యర్థుల విజయంపై జరుగుతున్నాయి. జనం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నలుగురుకలిసిన చోట బెట్టింగులు జరుగుతుండటంతో ఎవరికీ అనుమానాలు రావడం లేదు. కేవలం నోటిమాటలతోనే ఈతతంగం జరుగుతుండటంతో పోలీసులుకూడా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది.కాకపోతే బెట్టింగులు కాసిన వ్యక్తులు మోసపోతే మాత్రం ఈవ్యవహారాలు బయటపడే అవకాశం ఉంది.

## ఫర్నిచర్ గోదాంలో అగ్నిప్రమాదం



**అత్తాపూర్ నవంబరు12,ప్రభాతవార్త :**
అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సులేమాన్ నగర్ డైమండ్ సిటీలో గల ఓ ఫర్నిచర్ వర్క్‌షాప్ గోదాంలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## లిఫ్ట్‌లో చిక్కుకుపోయిన డెలివరీ బాయ్

**-కాపాడిన ఫైర్, పోలీస్ సిబ్బంది**

**మలక్ పేట ,నవంబర్ 12, ప్రభాతవార్త:**
ఫుడ్ ను డెలివరీ చేయడానికి వెళ్ళిన డెలివరీ బాయ్ అపార్ట్మెంట్‌లోని లిఫ్ట్ లో చిక్కుకుపోవడంతో మలక్ పేట అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు డెలివరీ బాయ్ ని సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు. ఈ ఈ సంఘటన చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి కథనం ప్రకారం.. సరూర్ నగర్ కు చెందిన రాంబాబు జొమాటో డెలివరీ బాయ్ గా పనిచేస్తున్నాడు. కాగా మంగళవారం సాయంత్రం చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రొఫెసర్స్ కాలనీలోని బారుహుల్లా రెసిడెన్సి అపార్ట్మెంట్స్ లోని రెండవ అంతస్తులో జొమాటో ఫుడ్ ఆర్డర్ ని డెలివరీ చేయడానికి రాంబాబు లిఫ్ట్ ఎక్కడం జరిగింది. కాగా లిఫ్ట్ డోర్ తెరుచుకోకపోవడంతో రాంబాబు డయల్ 100 కు ఫోన్ చేయగా వారు చాదర్ ఘాట్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అపార్ట్మెంట్ వద్దకు చేరుకుని వెంటనే మలక్ పేట అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించడంతో ఫైర్ ఇంజన్ తో సంఘటన ప్రాంతానికి చేరుకున్న అగ్నిమాపక అధికారులు, సిబ్బంది వెంటనే లిఫ్ట్ డోర్ ను పగులగొట్టి రాంబాబును రక్షించి సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. దీంతో రాంబాబు పోలీసులకు, అగ్నిమాపక అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.


డెలివరీ బాయ్ ని సురక్షి తంగా లిఫ్ట్ నుంచి బయటకు తీసుకు వచ్చిన పోలీసులు, ఫైర్ సిబ్బంది

## ఈవిఎంలలో అభ్యర్థుల భవితవ్యం

**-రేపు జూబ్లీహిల్స్ ఉపఎన్నిక కౌంటింగ్**

**-కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ముమ్మర ఏర్పాట్లు**

**-స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత**

**-4లక్షల్లో మందిలో 1,94,631 మంది ఓటుహక్కు వినియోగం**

**-పురుషులు 99, 771, మహిళలు 94,855 ఇతరులు 30మంది**


ఎన్నికల కౌంటింగ్ కేంద్రం ముందు సాయుధ పహారా

**హైదరాబాద్,నవంబర్ 12,ప్రభాతవార్త:**
ఈ నెల 11న జరిగిన పోలింగ్ లో భాగంగా నియోజకవర్గంలో మొత్తం 4 లక్షల 1 వెయ్యి 365 మంది ఓటర్లుండగా వీరిలో మొత్తం లక్షా 94 వేల 631 మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకోగా, వీరిలో పురుషులు 99 వేల 771 మంది కాగా, మహిళలు 94 వేల 855 మంది కాగా, థర్డ్ జెండర్ కు చెందిన 30 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి బుధవారం అధికారికంగా ప్రకటించారు. ఈ నియోజకవర్గంలో 11న జరిగిన పోలింగ్ లో సుమారు 48.49 శాతం ఓట్లు పోలైనట్లు కూడా వెల్లడించారు. డిస్ట్రిబ్యూషన్ కమ్ రిసెప్షన్ సెంటర్ ను ఏర్పాటు చేసిన యూసుఫ్ గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలోనే ఈ నెల 14న ఉదయం ఎనిమిది గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల విభాగం ఏర్పాట్లు చేస్తుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి ఇప్పటికే పలు దఫాలుగా ఎలక్షన్ స్టాఫ్ కు శిక్షణ కూడా నిర్వహించారు. మొత్తం పోలైన లక్షా 94 వేల 632 ఓట్లను పది రౌండ్లుగా 42 టేబుళ్లపై లెక్కింపు ప్రక్రియను నిర్వహించనున్నారు. ఒక్కో టేబుల్ కు ముగ్గురు సిబ్బందిని నియమించారు. వీరిలో ఒకరు టేబుల్ సూపర్ వైజర్, మరొకరు అసిస్టెంట్ టేబుల్ సూపర్ వైజర్ కాగా, మరోకరు సహాయక సిబ్బందిని నియమించారు. పోలింగ్ స్టేషన్ల నెంబర్ 1 నుంచి 407 వరకు ఇప్పటికే స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరిచిన ఈవీఎంలను అభ్యర్థులు, వారి కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓపెన్ చేస్న్యున్నారు. ఎన్నికల విభాగం అధికారులు అంచనాలను తారు మారు చేస్తూ తక్కువ పోలింగ్ శాతం నమోదు కావటంతో శుక్రవారం మధ్యాహ్నం మూడింటి కల్లా తుది ఫలితాన్ని ప్రకటించే అవకాశమున్నట్లు సమాచారం. పోలింగ్ స్టేషన్ల ఆవరణలో అమలు చేసిన వంద మీటర్ల ఆంక్షను శుక్రవారం కౌంటింగ్ సందర్భంగా కూడా అమల్లో ఉంటుందని ఎలక్షన్ వింగ్ అధికారులు చెబుతున్నారు. కౌంటింగ్ సెంటర్ లో పటిష్టమైన భద్రతతో పాటు సీసీ టీవీ కెమెరాలు , సాయుధ బలగాలతో మధ్య కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలోనీ స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవీఎంలను టేబుల్స్ పైగా తీసుకువచ్చి లెక్కించేందుకు కావల్సిన స్థాయిలో కౌంటింగ్ స్టాఫ్‌ను నియమించినట్లు తెలిసింది.

### రౌండ్ల వారీగా ఫలితాలు..

రేపు ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమయ్యే ఔట్ల లెక్కింపు కార్యక్రమాన్ని మొత్తం 10 రౌండ్లుగా కొనసాగించనున్నారు. ఒక్కో రౌండ్ వారీగా ఫలితాలను వెల్లడించనున్నారు. ఎన్నికల బరిలో మొత్తం 58 మంది ఉండగా, నోటా తో కలిపి మొత్తం 59 మందికి పోలైన ఓట్లను లెక్కించనున్నారు. ఒక్కో రౌండ్ కు సంబంధించి 58 అభ్యర్థులు, నోటాకు పోలైన ఓట్ల సంఖ్యను వెల్లడించనున్నారు. కానీ ప్రధాన పోటీ అధికార, విపక్షాలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యనే ఉండే అవకాశ మున్నట్లు పోలింగ్ సరళిని బట్టి అంచనా వేయవచ్చు.

## టీ హబ్‌లో హైదరాబాద్ ఇన్నోవేషన్ సమ్మిట్-2025



ఆవిష్కర్తలను సత్కరిస్తున్న ప్రతినిధులు.

**జూబ్లీహిల్స్, నవంబరు 12, ప్రభాతవార్త:** ఉన్నత విద్య, మేధో సంపత్తి, వాణిజ్యీకరణ ఇండో- యూరోపియన్ స్టార్టప్ సహకారం భవిష్యత్‌పై ఫస్ట్ జెన్- ఇండో యూరో సింక్రనైజేషన్ సంయుక్తంగా టీ హబ్ లో బుధవారం సదస్సు నిర్వహించారు. ఇన్నోవేషన్ సమ్మిట్ - 2025 పేరుతో నిర్వహించిన ఈ సదస్సులో విద్య, పరిశ్రమలు, ఆవిష్కరణ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఫస్ట్‌జెన్ వ్యవస్థాపకుడు, సీఈఓ ఫిలిప్ అస్మస్ మాట్లాడుతూ... హైదరాబాద్ ఇన్నోవేషన్ సమ్మిట్-2025లో ఇండో-యూరోపియన్ భాగస్వామ్యానికి కొత్త దిశ చూపనుందన్నారు. స్థిరమైన ఆవిష్కరణలు, అంతర్జాతీయ భాగస్వామ్యాల ప్రాధాన్యత గురించి ఆయన వివరించారు. "స్థిరమైన ఆవిష్కరణల్లు, "అంతర్జాతీయ సహకారం ప్రాధాన్యతను ఆయన వెల్లడించారు. "ఇండియా-యూరప్ భాగస్వామ్యం కేవలం ఆర్థిక లాభాలకు మాత్రమే కాదు, జ్ఞాన మార్పిడి, మానవ వనరుల పరస్పర శిక్షణ, కొత్త సాంకేతిక ఆవిష్కరణలకు కూడా తోడ్పడుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఫస్ట్‌జెన్, ఐఈఎస్ సంయుక్తంగా సూపర్ 100 ఇన్నోవేటర్స్ విజయాలను ఇక్కడ ఘనంగా జరుపుకున్నారు. వివిధ విద్యాసంస్థల నుండి వచ్చిన నూతన ఆవిష్కరణల ప్రతిభను చాటిచెప్పిన వారిని గుర్తించి సత్కరించారు.

### 'హైపెక్స్-2025' పేరిట తపాల స్టాంపులు, నాణేల ప్రదర్శన




సమావేశంలో మాట్లాడుతున్న సాగి శ్రీనివాసరాజు

**సైఫాబాద్, నవంబరు 12 ప్రభాతవార్త:** బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీ నుంచి మూడు రోజులపాటు 'హైపెక్స్-2025' పేరిట తపాలా స్టాంపులు, నాణేలు, పేపర్స్ కరెన్సీ, పురాతన వస్తువుల ప్రదర్శన రెడ్‌హిల్స్‌లోని ప్యాప్సిలో జరుగుతుందని పిలాటెలిక్ అండ్ హాబిస్ సొసైటి కార్యదర్శి సాగి శ్రీనివాసరాజు తెలిపారు. బుధవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో దేశం మొత్తం నుంచి 60 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని, ఈ ప్రదర్శనను చీఫ్ పోస్ట్ మాస్టర్ హైదరాబాద్ జిపిఓ వీణాకుమారి ప్రారంభిస్తారని చెప్పారు. పాత నాణేలు, నోట్లు కొట్టామని సోషల్ మీడియా వేదిక ద్వారా కొంత మంది మోసాలకు పాల్పడుతున్నారని, వాటితో తమ సొసైటికి ఏ లాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశం లో సొసైటి సంయుక్త కార్యదర్శి ఎస్.కాంత్, మేనేజింగ్ కమిటి సభ్యులు సంతోష్‌రెడ్డి, రాధాకృష్ణ, దీపక్‌కుమార్‌సేథియా పాల్గొన్నారు.

### 15న విజయభారతి పుస్తకాల ఆవిష్కరణ సభ

**సైఫాబాద్, నవంబరు 12 ప్రభాతవార్త:** డా.బి.విజయభారతి 84వ జయంతిని పురస్కరించుకుని బొజ్జా తారకం ట్రస్ట్, డా.బి.ఆర్. అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుప్రసిద్ధ రచయిత్రి, తెలుగు అకాడమీ మాజీ డైరెక్టర్ డా.బి.విజయభారతి పుస్తకాల ఆవిష్కరణ సభ ఈ నెల 15వ తేదీన జరుగుతుందని ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గనుమల జ్ఞానేశ్వర్ తెలిపారు. 15వ తేదీ సాయంత్రం 6 గంటలకు బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో 'ఆత్మగౌరవ పోరాటాలు-ఒక పరిశీలన', 'విజయ కవితలు' (కవితా సంపుటి) అనే పుస్తకాల ఆవిష్కరణ సభ జరుగుతుందని, ఈ సభకు అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ డా.కె.లింగయ్య అధ్యక్షత వహిస్తారని, ముఖ్యఅతిధిగా అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్-ఛైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, అతిధులుగా డా.సింగిశెట్టి శ్రీనివాస్, ప్రొఫెసర్ కె.సత్యనారాయణ, మెర్సి మార్గరేట్, డా.కోయి కోటేశ్వరరావు, గీతా రామస్వామి, గడ్డం ఝాన్సీ తదితరులు పాల్గొంటారని ఆయన చెప్పారు.

### బాయమ్మగాలి ప్రాంతంలో విస్తృతంగా పర్యటించిన కాలేరు



ప్రజలు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**హైదరాబాద్, నవంబరు 12 ప్రభాతవార్త:** అంబర్‌పేట నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బుధవారం నల్లకుంట డివిజన్‌లోని బాయమ్మగాలి ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఒక కోటి 6 లక్షల రూపాయల వ్యయంతో జరుగుతున్న సిసి రోడ్ల పనులను పర్యవేక్షించారు. పనులు వేగంగా నాణ్యతతో పనిచేయాలని, ఏలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక ప్రజలతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటి సమస్యలు పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, డిజిఎం విష్ణువర్ధన్‌రావు,వ ఎఈ రోహిత్, జిహెచ్ఎంసి ఎఈ ప్రశాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల పనితీరు పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం



గంధంగూడ శ్రీనివాస్‌నగర్ కాలనీలో విద్యుత్ వైర్లకు మరమ్మత్తులు చేస్తున్న కరెంటు సిబ్బంది.

**నార్సింగి, నవంబర్ 12 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడ శ్రీనివాస్ నగర్ కాలనీలో గత కొంత కాలంగా విద్యుత్ వైర్ల సమస్య తీవ్రంగా ఉండేది. గాలిదూలి వచ్చినా, వర్షం కురిసినా మంటలు వచ్చేవి. దీంతో స్థానికులు భయాందోళన చెందేవారు. ఈ సమస్యను పరిష్కరించాలని అనేకమార్లు కాలనీ అధ్యక్షులు నాగేష్ తమ అసోసియేషన్ సభ్యులతో కలిసి విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదులు, వినతిపత్రాలు అందజేశారు. వారు స్పందించ లేదు. ఇటీవల అధికారులు మారడంతో మళ్లీ తమ కరెంటు వైర్ల సమస్యను పరిష్కరించాలని పట్టువదలి విక్రమార్కుడిలా నాగేష్ కొత్త ఏఈ రమేష్‌ను కోరారు. ఆయన వెంటనే స్పందించి సాధ్యమైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరించాలని లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌ను ఆదేశించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ తమ సిబ్బందితో కలిసి వచ్చి వేలాడుతున్న వైర్లను లాగి, స్థంభాలకు కట్టారు. ఎవరి ఇళ్లకు ఎలాంటి ప్రమాదం జరుగకుండా చేశారు. దీంతో కాలనీ ప్రజలంతా సంతోషంను వ్యక్తం చేశారు. ఏఈ రమేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కిన్నెర నాటకరంగ ప్రోత్సాహం శ్లాఘనీయం

**-ఏపి పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం**



ఎక్కడో ... ఏదో నాటికలో ఒక దృశ్యం

**నాంపల్లి, నవంబరు 12 ప్రభాతవార్త :** కిన్నెర సంస్థ తమ 48వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 4రోజుల పాటు నాటకోత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ నాటకరంగాన్ని ప్రోత్సహించడం శ్లాఘనీయమని ఏపి పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం అన్నారు. నాటకాల ప్రదర్శనను నిర్వహించడం ఒక ఎత్తైతే ఈ ప్రదర్శనలకు సౌజన్యంతో ప్రోత్సహించి సహకరిస్తున్న వై.కె కళాపరిషత్ బొప్పన నరసింహారావు (బుజ్జి), బిఎన్ఎస్.కుమార్, కె.రాధాకృష్ణ, సుబ్బరాయశర్మ, ఎఆర్.కృష్ణ మెమోరియల్ ట్రస్ట్‌ల కళాసేవ మరోయెత్తని వారిని అభినందించారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సంస్థ 48వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వారం రోజుల పాటు జరుగుతున్న కళాప్రదర్శనల్లో భాగంగా 4రోజుల నాటకోత్సవాలలో మూడవరోజు బుధవారం రాత్రి నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో వై.కె నాటక కళాపరిషత్ సౌజన్యంతో పరమాత్ముని క్రియేషన్స్, హైదరాబాద్ వారిచే పసుపులేటి తాతారావు మూలకథ, పరమాత్ముని శివరాం రచన మరియు దర్శకత్వంలో రూపొందిన ఎక్కడో ... ఏదో నాటిక; సిరిమువ్వ కల్చరల్స్, హైదరాబాద్ వారిచే మంజునాథ రచన దర్శకత్వంలో రూపొందిన గేమ్ నాటికలు అద్భుతంగా ప్రదర్శింపబడి నాటకప్రియులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం, గౌరవ అతిథులుగా గుమ్మడి గోపాలకృష్ణ, బొప్పన నరసింహారావు (బుజ్జి)లు నేటి నాటిక ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు.

## 15న జరిగే బిసి అక్రోశ సభను విజయవంతం చేయాలి : బాలరాజ్ గౌడ్



అభివాదం చేస్తున్న బాలరాజ్ గౌడ్. అయిలి వెంకన్న గౌడ్, యెలికట్టే విజయకుమార్ గౌడ్ తదితరులు

**హైదరాబాద్, నవంబర్ 12,ప్రభాతవార్త:** ఈ నెల 15న కామారెడ్డిలో జరిగే బీసీ ఆక్రోశ సభను విజయవంతం చేయాలని తెలంగాణ బీసీ పొలిటికల్ ప్రంట్ పిలుపునిచ్చింది. బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. బుధవారం చిక్కడపల్లిలోని బీసీ పొలిటికల్ ప్రంట్ రాష్ట్ర కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీపీ పొలిటికల్ ప్రంట్ చైర్మన్ బాలగొని బాలరాజ్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కామారెడ్డి. డిక్లరేషను అమలు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ.. బహుజన రాజ్యస్థాపన కోసం ఐక్య ఉద్యమాలు నిర్మించాలన్నారు. బీసీలంతా రాజ కీయంగా ఎదగాలని సూచించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడానికి పార్లమెంట్ లో రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. సభకు అధ్యక్షత వహించిన పొలిటికల్ ప్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌర్ మాట్లాడుతూ రాజ్యాంగ సవరణ ద్వారానే 42 శాతం రిజర్వేషన్ సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బీసీల అభివృద్ధి కోసం 20 వేల కోట్ల బడ్జెట్ను కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యమాన్ని గల్లీ నుంచి ఢిల్లీ వరకు తీసుకుపోతామని అన్నారు. యెలికట్టే విజయ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. చట్ట సభల్లో మేమెంతో మాకంతా వాటా కావాలని డిమాండ్ చేశారు. పథకాలు మాకు పట్టాభిషేకాలు మీకా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ ప్రంట్ రాష్ట్ర నాయకులు అంబాల నారాయణ గౌడ్, వి నాగభూషణం, గడ్డమీది విజయకుమార్ గౌడ్, బదేసాస్, నెర్లం భాస్కర్, మెట్టు దస్ రాజ్ ఓయు జాక్ నాయకులు సాంబశివ గౌడ్, పంజాల రాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## చార్మినార్ మహాదేవ్ మందిరం ఎదురుగా చెత్త కుప్పలు



చార్మినార్ శ్రీ మహాదేవ్ మందిరం ఎదురుగా చెత్త కుప్పలు

**చార్మినార్,నవంబరు 12 ప్రభాతవార్త :** చార్మినార్ శ్రీ మహాదేవ్ మందిరం ఎదురుగా చెత్త కుప్పలు నిల్వ ఉండటంతో ప్రజలు,భక్తులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.రహదారిపై చెత్త కుప్పలు పేరుకు పోయి ఉన్నాయి. చెత్త కుప్పలు నుంచి విపరీతమైన దుర్వాసన వ్యాపించటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.ఇక్కడ సక్రమంగా పారిశుద్ధ్య పనులు జరగటం లేదని స్థానిక ప్రజలు తమ నిరసన వ్యక్తం చేశారు.చార్మినార్ శ్రీ మహాదేవ్ మందిరం ప్రక్కనే బంగారం,వెండి ఆభరణాల దుకాణాలు ఉన్నాయి.ప్రతీ రోజు ప్రజలు షాపులలో ఆభరణాలు ఖరీదు చేయటానికి వస్తున్న సమయంలో తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.గుల్జాంహౌస్,చార్మినార్,చార్‌కమాన్,కోకరివాడి,షక్కర్‌కోట,బండి అడ్డ,కాలీకమాన్‌తో పాటు పలు బస్తీలకు చెందిన భక్తులు ప్రతీ రోజు చార్మినార్ శ్రీ మహాదేవ్ మందిరానికి పూజలు నిర్వహించటానికి వచ్చే సమయంలో రహదారిలో ఉన్న చెత్త కుప్పలను దాటుకుని వెళుతున్నారు. చెత్త కుప్పలు కుళ్లి పోయి దుర్వాసన వ్యాపించటంతో ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చార్మినార్ శ్రీ మహాదేవ్ మందిరం వద్ద ఉన్న చెత్త కుప్పలు తొలగించి,ప్రతీ రోజు పారిశుద్ధ్య పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## 21న "తెలంగాణ ముదిరాజ్ మహాసభ "వార్షికోత్సవ వేడుకలు



పోస్టర్ ఆవిష్కస్తున్న అశోక్‌ముదిరాజ్, వెంకట నర్సయ్య, వరుణ్‌రాజ్,

**హైదరాబాద్,నవంబర్ 12,ప్రభాతవార్త:** ఈనెల 21న తెలంగాణ ముదిరాజ్ మహాసభ వార్షికోత్సవ వేడుకలుఘనంగా నిర్వహిస్తామని తెలంగాణ ముదిరాజ్ మహాసభ వెల్లడించింది.ఈ మేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లొ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉపాధ్యక్షులు పల్లె బోయన అశోక్ ముదిరాజ్, వెంకట నర్సయ్య మాట్లాడుతూ 11వ వార్షికోత్సవంతో పాటు ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని తెలంగాణ రాష్ట్రంలోని పల్లెలు, పట్టణాలు, జిల్లా కేంద్రాల్లో ముదిరాజ్ జెండా ఎగరవేసి ర్యాలీలలు నిర్వహించి సంబరాలు జరుపుతామన్నారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఏర్పడి 11 సంవత్సరాలు గడిచిందని. తమ పోరాటాల ఫలితంగా కోకాపేటలో ముదిరాజ్ భవనం కోసం 300 కోట్ల విలువైన ఐదు ఎకరాలు స్థలాన్ని సాధించడం జరిగిందన్నారు. అలాగే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన హమి ప్రకారం 42 విద్యా ఉద్యోగ రిజర్వేషన్లు తమకు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే బీసీ డీలో ఉన్న ముదిరాజులను బిసిఏ లో మార్చాలన్నారు. ముదిరాజ్ సొసైటీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 100 కోట్ల నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.మత్స్య సంపదపై ముదిరాజులకు హక్కులు ఉండే విధంగా చట్టపరమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. మత్స్యశాఖకు 3వేల కోట్ల రూపాయలు కేటాయించి వివిధ పథకాల ద్వారా మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట నరసయ్య, వరుణ్ రాజ్, బల్ల సత్తయ్య, బొమ్మల స్వామి, వరుణ్ రాజ్, ఉప్పరి నారాయణ, నూతి చలపతి తదితరులు పాల్గొన్నారు.

## 16 నుంచి మండల పూజలు ప్రారంభం



మండల పూజల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ

**జూబ్లీహిల్స్, నవంబరు 12, ప్రభాతవార్త:** శ్రీనగర్‌కాలనీలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం, భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి నిర్వహించే మండల పూజ మహోత్సవ వేడుకలకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ సిపిరి అర్జున్‌యాదవ్, ఆలయ ఈఓ యం. శ్రీనివాసవర్మ, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి వీటిని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ నెల 16 నుంచి డిసెంబరు 27 వరకు అయ్యప్ప స్వామి దేవాలయంలో మండల పూజా మహోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రోజు ఉదయం 5.30 గంటలకు మహాగణపతి హోమం, 8 గంటలకు పంచామృతాలతో అభిషేకం, 8.15 గంటలకు అర్చన, మహాహారతి, మధ్యాహ్నం 12 గంటల నుండి 2 గంటల వరకు స్వాములకు బిక్ష, సాయంత్రం 6.30 గంటలకు పడిపూజ, భజన, రాత్రి 9 గంటలకు మహా హారతి, హరివరాసనం, రాత్రి 9.30 గంటలకు తీర్థప్రసాద వితరణ, అల్పాహారం ఉంటాయన్నారు. డిసెంబరు 12న 108 అష్టోత్తర కలశాలతో స్వామివారికి అభిషేకం, డిసెంబరు 14న గజారోహణ మహోత్సవం, 27న మహా పూర్ణాహుతి, లక్షపూష్పార్చన కార్యక్రమాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజున గణపతి పూజ, పుణ్యహావచనం, అఖండ దీపారాధన, సర్వతోభద్ర మండల దేవాతా ఆహ్వాన కలశస్థాపన, తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు దినేష్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సాయప్రసాద్ కోనేరు, తుమ్మల గీతాచౌదరి, సుబ్బారావు, నర్సింగ్‌యాదవ్, శరత్‌బాబు, కళ్యాణి, కటకం రాజేష్, జగదీష్, విజయ్‌కుమార్, లక్ష్మణ్, మురళీధర్ శర్మ, శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

### జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయం
### -తెలంగాణ కమ్మ సంఘాల సమాఖ్య

**హైదరాబాద్, నవంబర్ 12,ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ బైఎలక్షన్స్‌లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని తెలంగాణ కమ్మ సంఘాల సమాఖ్య తెలిపింది. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షులు బొడ్డు రవిశంకర్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ అభ్యర్థినవీన్ యాదవ్‌కు మద్దత్తు పలికినందుకు కమ్మ కులస్తులకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కమ్మ కులస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారన్నారు. సమాఖ్య తరపున జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో మధురా నగర్, వెంగళరావు నగర్, బోరబండ వంటి ప్రాంతాలలో ప్రతీ ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను సమాఖ్య తరపున ప్రచారం చేశామన్నారు. అరవై సంఘాలు ఐక్యతతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం కృషి చేశామన్నారు.14 న కాంగ్రెస్ విజయోత్సవాలలో తాము భాగస్వాములం అవుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు గంగవరపు రామకృష్ణ ప్రసాద్, కృష్ణ ప్రసాద్,ఉన్నం సుబ్బారావు,బొబ్బ రంగారావు, వేమూరి వెంకటేశ్వరరావు, ఎలమర్తి రామకృష్ణ, ఇరుకుల పాటి నరసింహరావు,యలమంచిలి వెంకట కృష్ణా రావు,ఉదయ్ కిరణ్, కొల్లి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 14 నుంచి 16 వరకు "కార్తీక మహోత్సవం"




పోస్టర్ ఆవిష్కరిస్తున్న పాండురంగారావు, సంధ్యారాణి, రాజ్‌గోపాల్ తదితరులు

**హైదరాబాద్, నవంబర్ 12,ప్రభాతవార్త:** మరో అత్యద్భుత ఆధ్యాత్మిక సమ్మేళనానికి భాగ్యనగరం వేదిక కానుంది. హైబిజ్ వన్ ఆధ్వర్యంలో కార్తీక మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగనుంది. హోమాలు, వ్రతాలు, అభిషేకాలు, పారాయణాలు.. ఇలాంటి సకల కార్యక్రమాలను ఒకేచోట నిర్వహించడం నిజంగా గొప్ప అనుభూతి. హైబిజ్ వన్ తొలిసారిగా ఈ బృహత్ కార్యాన్ని చేపట్టింది. హైదరాబాద్ అమీర్ పేట ధరమ్ కరణ్ రోడ్ లోని ఎం.సి.హెచ్ గ్రౌండ్ లో నవంబర్ 14 నుంచి 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు వీటన్నింటినీ జరుపనుంది. ఈమేరకు బుధవారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన కార్యక్రమంలో ఇండో నేపాల్ రుద్రాక్ష ఆర్గనైజషన్ ఫౌండర్ చైర్మన్ డా.జి. పాండురంగరావు,హైబిజ్ వన్ ఫౌండర్ డాక్టర్ జె. సంధ్యా రాణి, హైబిజ్ వ్యవస్థాపకులు ఎం రాజ్ గోపాల్ పాల్గొన్నారు. ఈసందర్భంగా కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. 14నఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు గణపతి హోమం, వేద్రాద్రి అర్చకుల ఆధ్వర్యంలో మహా చండీ హోమం, శ్రీ లలితా సహస్రనామ హోమం పూజా కార్యక్రమాల అనంతరం అన్న ప్రసాద వితరణ, సాయంత్రం 6 నుంచి రాత్రి 8 వరకు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం,లలితా సహస్రనామ పారాయణం, శ్రీమాన్ పవన్ ప్రభుజీ వారి ఆధ్వర్యంలో భగవద్గీత ప్రవచనం ఉంటుందన్నారు. 15న దయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు రుద్రాభిషేకం, రుద్ర హోమం, కీసరగుట్ట దేవస్థానం ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం, సాయంత్రం 6 నుంచి రాత్రి 9.30 వరకు అడికె కార్తీక్ స్వామి వారి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా, శ్రీనగర్ కాలనీ అయ్యప్ప దేవస్థానం పూజారి శ్రీనివాస స్వామి గారి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడిపూజ , 16న ఉదయం 8 గం. నుంచి మధ్యాహ్నం 12.30 వరకు అన్నవరం దేవస్థానం వారి ఆధ్వర్యంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, అనంతరం అన్న ప్రసాద వితరసాయంత్రం 5 నుంచి రాత్రి 8 వరకు డాక్టర్ చెక్కిళ్ల రాజేంద్ర కుమార్ గౌడ్ గురుజీ వారి ఆధ్వర్యంలో కార్తీక పురాణ విశిష్టత ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున హాజరై కార్తీక మహోత్సవానికి విజయవంతం చేయాలని కోరారు.

## అయ్యప్ప నామస్మరణంతో మారుమ్రోగిన నార్సింగి



నార్సింగిలో జరిగిన అయ్యప్ప మహాపడి పూజలో పాల్గొన్న భక్తజనుల దృశ్యం

**నార్సింగి, నవంబర్ 12 ప్రభాతవార్త :** గండిపేట మండల పరిధిలోని నార్సింగి బుధవారం అయ్యప్ప నామ స్మరణంతో మారునరమోగిపోయింది. పెద్ద సంఖ్యలో అయ్యప్ప మాలధారులు, భక్తులు ఈ పూజలో పాల్గొని అయ్యప్ప భక్తిగీతాలపన చేశారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నార్సింగికి చెందిన నర్సింగ్‌రావ్ గురుస్వామి ఆలపించిన భజన గీతాలు ఆహుతులను, భక్తులను ఆద్యాంతం భక్తిసాగరంలో ముంచెత్తాయి. స్వాములు, భక్తులంతా పాటలకు ఆడి,పాడి ఆనందపరవశులయ్యారు. అచ్చం అయ్యప్ప స్వామి సన్నిధిలో జరిగిన తీరుగానే పడిపూజను నిర్వహించారు. గురుస్వామి సిరుగుమల్లె రాజు ఉస్తాద్ ఈ పూజలో పాల్గొని సనాతన ధర్మం గొప్పతనం గురించి వివరించారు. హిందువులు నిర్వహించే ప్రతీ పూజ, పండగ వెనుకాల ఆరోగ్య రహస్యం దాగి ఉంటుందన్నారు. ప్రకృతి సిద్దంగా జీవించడం, అన్ని ప్రాణులలో ఉండే జీవుడు ఒక్కడేనని, ఏ ప్రాణి ఇబ్బంది పడకుండా తన జీవనంను సాగించడం మన ధర్మం గొప్పతనమన్నారు. ఏటేటా అయ్యప్ప స్వాముల సంఖ్య పెరుగుండడం, యువతరంలో ఆధ్యాత్మికతపై ఆసక్తి పెరుగుతుండడం శుభ పరిణామమన్నారు. మనం నిత్యం సనాతన ధర్మంను ఆచరించాలని, మన బిడ్డలచేత ఆచరింపచేయాలన్నారు. మన బిడ్డలకు సరైన ఆధ్యాత్మిక విద్య, ఆరోగ్యం, బలవర్ధకమైన ఆహారంను అందించేందుకు ప్రతీ తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు క్యాతం అశోక్ యాదవ్, నాయకులు వినోద్ కుమార్, జెల్లి వెకంటేష్ ముదిరాజ్‌లతో పాటు పెద్ద సంఖ్యలో భక్తజనం పాల్గొన్నారు.

## వైభవంగా మహా పడిపూజ



పూజ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి,నవంబరు 12 ప్రభాతవార్త :** కాటేదాన్‌లోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి శబరిమలకి32 మంది స్వాములు పాద యాత్రతో బయలుదేరారు.మహబూబ్‌నగర్ కందుకూర్ శ్రీ రామలింగేశ్వర దేవాలయంలో వేముల వెంకటేష్ నారీకేల గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన 18వ మహాపడి పూజ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. పాదయాత్రలో పాల్గొన్న స్వాములకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వినయ్ గురుస్వామి,ప్రశాంత్ గురుస్వామి,నర్సిరెడ్డి గురుస్వామి,రమేష్ రెడ్డి గురుస్వామి, కొండలు గురుస్వామి,వెంకటేష్ గురుస్వామి,అఖిల్,తేజ భరత్ మల్లేష్,శివ పాల్గొన్నారు.

### 22న రాజాబహద్దూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల స్నాతకోత్సవ వేడుకలు
### కళాశాల ప్రిన్స్‌పల్ ప్రొఫెసర్ అచ్యుతదేవి




కళాశాల స్నాతకోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న జె.అచ్యుతదేవి తదితరులు

**ముషీరాబాద్, నవంబర్ 12, ప్రభాతవార్త:** ఈనెల 22న నారాయణగూడలోని రాజాబహద్దూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల 14వ స్నాతకోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్స్‌పల్ ప్రొఫెసర్ జే.అచ్యుతదేవి తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో మహిళా విద్యా సంఘం కార్యదర్శి ప్రొఫెసర్ కట్టా ముత్యంరెడ్డి, కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ జి.సుదర్శన్‌రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.వాణి మాధవిలతలతో కలసి ఆమె స్నాతకోత్సవ వేడుకల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అచ్చుతదేవి మాట్లాడుతూ ఈనెల 22న జరగనున్న స్నాతకోత్సవ వేడుకలలో 2023, 2024 విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలను అందచేసి, ప్రోత్సహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల డిగ్రీల ప్రధానోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ హరిచందన దాసరి ఐఏఎస్, ఉస్మానియ విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కే.శశికాంత్ పాల్గొంటారని వివరించారు. ఈ సమావేశంలో వైస్ ప్రిన్స్‌పల్ కే.సింధూరి, కన్వీనర్ డాక్టర్ ఎం.సుచిత్ర, కో కన్వీనర్ డాక్టర్ కే.స్వప్న తదితరులు పాల్గొన్నారు.

### రూ.9.41 లక్షల విలువ చేసే గంజాయి స్వాధీనం

**అడ్డగుట్ట,నవంబర్ 12 ప్రభాతవార్త:** గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని తరలిస్తున్న అంతర్ రాష్ట్ర ముఠాను సికింద్రాబాద్ జి.ఆర్.పి. ఆర్.పి.ఎఫ్.పోలీసులు తనిఖీలు నిర్వహించిన వారి వద్ద నుంచి 9.41 లక్షల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకొని ఇరువురిని అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ గౌడ్,ఎస్.ఐ.ఎస్.వి.సుబ్బారెడ్డిలు తెలిపిన వివిరాల ప్రకారం బిహార్‌లోని నలంద జిల్లాకు చెందిన అజయ్ కుమార్ (35), రీనా దేవి (40) అనే భార్యభర్తలు ఒడిశా రాయ గాడ నుంచి ముంబాయికి గంజాయిని రైల్‌లో తరలిస్తుండగా బుధవారం సికింద్రాబాద్‌కు చేరుకున్న రైల్‌లో జి.ఆర్.పి, ఆర్.పి.ఎఫ్.సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా వారి వద్ద నుంచి 9.41 లక్షల విలువ చేసే 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరికి సరఫర చేసిన బిహార్ ప్రాంతానికి చెందిన పంకజ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ కేసును రైల్వే సూపరిండెంట్ చందనా దీప్తి, ఐజీపి,ఎస్.ఎన్.జావేద్,రమేశ్ నాయుడుల ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రిటర్నింగ్ మదర్స్ కాన్ఫరెన్స్ 2025

**నిజాంపేట్, నవంబర్ 12, ప్రభాతవార్త**

180కుపైగా నిపుణులు సమానమైన కెరీర్ పునరాగమనం కోసం రిటర్నింగ్ మదర్స్ కాన్ఫరెన్స్ 2025లో ఏకమయ్యారు. బుధవారం విజ్ఞాన జ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సు, సమగ్ర పునరేకీకరణ కోసం ఆలోచనలు, పరిష్కారాలను పంచుకునే ప్రపంచ వేదికగా నిలిచింది. మహిళలు కేర్గివింగ్ విరామాల తరువాత లక్ష్యంతో, సమానతతో తిరిగి పనిలో చేరేందుకు సహకరించేందుకు ఉన్న అత్యవసర వర్క్‌ఫోర్స్ సవాళ్లను పరిష్కరించేందుకు రిటర్నింగ్ మదర్స్ కాన్ఫరెన్స్ 2025 అకాడెమియా, పరిశ్రమ, అభివృద్ధి రంగాల నుండి 180కుపైగా నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. వరల్డ్ బ్యాంకు, సిలికాన్ లాబ్స్, బియానిక్యూ ప్లానర్స్, ప్రైయోనిక్, జనయిన్సిట్ ఈ కార్యక్రమంలో పాల్గొని నిపుణులను నియమించడానికి ముందుకొచ్చి, రిటర్నింగ్ మదర్స్ కాన్ఫరెన్స్ యొక్క ఉద్దేశ్యానికి మరింత బలం చేకూర్చాయి. ప్రపంచ బ్యాంక్ సోషల్ డెవలప్మెంట్ స్పెషలిస్ట్ తను శ్రీ భౌమిక్ మాట్లాడుతూ దక్షిణాసియాలో మహిళల శ్రామికశక్తి పాల్గొనడం, ముఖ్యంగా ఇంధన, మౌలిక సదుపాయాల రంగాల్లో 8-23 మధ్యలో మాత్రమే ఉందని, పిల్లలు, వృద్ధ తల్లిదండ్రులు లేదా జీవిత భాగస్వాముల కోసం కేర్గివింగ్ చేయడం ప్రధాన కారణమన్నారు. రిటర్నింగ్ మదర్స్ ప్రోగ్రా మ్, విపర్ నెట్వర్క్ వంటి కార్యక్రమాల ద్వారా, మహిళలు శిక్ష లేకుండా తిరిగి చేరగల వాతావరణాలను సృష్టించడం మా లక్ష్యమని, ఇది కేవలం రిటర్నింగ్ మదర్స్ గురించే కాదు రిటర్నింగ్ పేరెంట్స్ గురించీ, పురుషులు, మహిళలకు సమానమైన కేర్ గివింగ్ ప్రమాణాలను ఏర్పరచడానికి సంబంధించినదని అన్నారు.

### భగత్‌సింగ్‌నగర్ సమస్యల పరిషారానికి సహకారం



చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు నరేందర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డిలను అభినందిస్తున్న ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్, డివిజన్ టీఆర్ఎస్ అధ్యక్షులు మహ్మద్ రఫీ

**కుత్బుల్లాపూర్, నవంబరు 12 ప్రభాతవార్త**

చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో మౌళిక సదుపాయాల కల్పనకు రాజకీయాలకు అతీతంగా పూర్తి సహయ, సహకారాలు అందిస్తానని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ హామీఇచ్చారు. భగత్‌సింగ్‌నగర్ సంక్షేమ సంఘ అధ్య, కార్యదర్శులుగా నూతనంగా ఎన్నికైన నరేందర్‌గౌడ్, ప్రతాప్ రెడ్డిలను ఆయన అభినందించారు. ఈసందర్భంగా స్థానిక డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు మహ్మద్‌రఫి ఆధ్వర్యంలో జరిగిన భగత్‌సింగ్‌నగర్ సంక్షమ సంఘ ప్రతినిధులు, బస్తీవాసులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సంక్షేమానికి అందరినీ కులుపుకుని పోయి బస్తీ అభివృద్ధికి కలిసికట్టుగా కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మహ్మద్‌రఫి,నూతన అధ్యక్షులు నరేందర్‌గౌడ్, ప్రధానకార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, నాయకులు బీసు వెంకటేశ్‌గౌడ్, రామకృష్ణ ముదిరాజ్, డాక్టర్. నాగభూషణం, వెంకట్‌రెడ్డి, శ్రీధర్, శివపాటిల్, నర్సింహ్మా, కృష్ణారెడ్డి, ముప్పిడి నర్సింహ్మా, మల్లేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

### కలవర పెడుతున్న వరుస దొంగతనాలు
### -సాఫ్ట్‌వేర్ ఇంట్లో బంగారం చోరీ

**అత్తాపూర్ నవంబరు12,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్‌లో వరుస దొంగతనాలు స్థానికులను కలవర పెడుతున్నాయి, మంగళవారం హైదర్‌గూడలో జరిగిన దొంగతనం మరవకముందే బుధవారం కిస్మాత్‌పూర్ ఓంనగర్ కాలనీలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇంట్లో దొంగలు పడి బంగారంను ఎత్తుకెళ్లిన ఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం...కిస్మాత్‌పూర్ ఓంనగర్ కాలనీ ఎస్ఎం ఎంక్లేవ్ డూప్లెక్స్ హౌస్ లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కిరణ్ ఇంట్లోకి అర్ధరాత్రి పలువురు దొంగలు మాస్కు ధరించి చోరబడ్డారు. ఆ సమయంలో కుటుంబ సభ్యులు అందరూ నిద్రిపోవడంతో కబోర్డులో ఆభరణాలు పెట్టి లాక్ వేయడం మార్చియారు. దింతో కబోర్డులో ఉన్న 30 తులాల బంగారాన్ని గమనించిన దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీ సులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మూడు ఇండ్లలో చోరికి యత్నించి ఒక ఇంట్లో బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు సిసి కెమెరాల్లో రికార్డు అయ్యాయని మరో ఇంటి తలుపులు తడుతుండగా ఇంటి యజమానులు కేకలు వేయడంతో అక్కడి నుండి పరుగులు తీసినట్లు స్థాని కులు పోలీసులకు వివరించారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని సిసి కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

## రైల్వే గార్డుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి : ఎస్.పి.సింగ్



రైల్వే మేనేజర్ల సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్ భవన్ ముందు ఆందోళన చేస్తున్న గార్డ్స్

**కంటోన్మెంట్,నవంబర్ 12 ప్రభాతవార్త:** భారత, దక్షిణ మధ్య రైల్వే రంగంలో పనిచేస్తున్న మేనేజర్లు, (గార్డ్స్) న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సిల్ ఛీఫ్ అడ్వైజర్ ఎస్.వి.సింగ్ డిమాండ్ చేశారు. బుధవారం సికింద్రాబాద్ రైల్ నిలయం ఎదురుగా ఉన్న హైదరాబాద్ రైల్వే భవన్ వద్ద ఏర్పాటు చేసిన ధర్నా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రైల్వేలో ఖాళీగా ఉన్న మేనేజర్ల ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. రైల్వే లోని మేనేజర్లు, గార్డ్స్ కు రావాల్సిన 25 శాతం అలవెన్స్‌లను పెంచాలన్నారు. 50 శాతం ఉన్న డీఏను 70 శాతం పెంచాలన్నారు. గూడ్స్ రైల్వే మేనేజర్లకు పాద పద్ధతిలోనే అలవెన్స్‌లు ఇవ్వడం సరైంది కాదన్నారు. రైల్వే మేనేజర్లకు పని భారం తగ్గించేందుకు ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే మేనేజర్స్ గార్డ్స్ అసోసియేషన్స్ హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజనల్ కార్యదర్శులు కె.క్రిష్ణ, ఆదిశేషగిరి రావ్, జోనల్ అధ్యక్షులు ఏ.కె.పాండే, మహేశ్ కుమార్, హైదరాబాద్ డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ రసుద్దీన్, ఎగ్బాల్, రామక్రిష్ణ, గట్టి శ్రీనివాస్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

## మహేంద్రహిల్స్‌ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా వందేమాతరం వేడుకలు



మహేంద్రహిల్స్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా వందే మాతరం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య

**కంటోన్మెంట్,నవంబర్ 12 ప్రభాతవార్త:** 150 సంవత్సరాల క్రితం దేశంలోని బిన్న ప్రాంతాల సంస్కృతి,సాంప్రదాయాలు,ప్రజల జీవన స్థితిగతులు కళ్లకు కట్టేలా బంకిం చంద్ర చటర్జీ వందే మాతరం గేయాన్ని రచించిన మహనీయుల ఆశయాలు స్థిర స్థాయిగా నిలువాలని ఎమ్మెల్సీ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యా సంస్థల చైర్మన్ మల్కా కొమురయ్య తెలిపారు. వందే మాతరం జాతీయ గీతం 150 సంవత్సరాల వసంత వేడుకలను పురస్కరించుకొని బుధవారం సికింద్రాబాద్ మహేంద్రహిల్స్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సిఈఓ యశస్వి, ప్రిన్సిపాల్ నందిత సుంకర, వైస్ ప్రిన్సిపాల్ సురేఖ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వందే మాతరం అంటూ నినాదాలు చేయడంతో పాఠశాల ప్రాంగణమంతా దేశ భక్తితో మారుమ్రోగింది.

## నిమోనియాతో గుర్తింపుతో ప్రాణాలు కాపాడవచ్చు : గంగాధర్‌రెడ్డి

**కంటోన్మెంట్,నవంబర్ 12 ప్రభాతవార్త:** నిమోనియా ఊపిరితిత్తులను ప్రభావితం చేసి ఇన్ఫెక్షన్‌తో ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడుతాయని, సకాలంలో వాటిని గుర్తించి వైద్య పరీక్షలు చేయించుకుంటే పూర్తిగా నయం అవుతుందని సికింద్రాబాద్ మెడికోవర్ ఆసుపత్రి ఛీఫ్ పల్మనాలజిస్ట్ డాక్టర్ గంగాధర్‌రెడ్డి మల్లూ తెలిపారు. నిమోనియా వ్యాధితో ప్రాణాలు కాపాడవచ్చు అనే అంశంపై బుధవారం సికింద్రాబాద్ మెడికోవర్ ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ నిమోనియా వ్యాధి జ్వరం, దగ్గు, శ్వాసలో ఇబ్బంది, ఛాతి నొప్పి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. వాటి లక్షణాలను తక్షణమే గుర్తించి చికిత్స ప్రారంభిస్తే నిమోనియా వ్యాధి నయం అవుతుందన్నారు.

## సనత్ నగర్‌లో పర్యటించిన కొలన్ బాల్‌రెడ్డి



సనత్ నగర్ డివిజన్‌లో వాటర్ సమస్యను పరిశీలిస్తున్న డివిజన్ అధ్యక్షులు, వాటర్స్ వర్క్స్ అధికారులు

**సంజీవరెడ్డి నగర్,నవంబర్ 12 ప్రభాతవార్త:** సనత్ నగర్ డివిజన్‌లో పలు కాలనీలు దాసారం బస్తీ, సీటైప్ ఎల్ఐజ కాలనీ,రవీంద్ర నగర్ కాలనీలో నీటి సమస్యపై సనత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కొలను లక్ష్మి బాల్‌రెడ్డిని కలిసిన కాలనీ వాసులు కాలనీలలో ఉన్న నీటి సమస్యలను అమెకు తెలిజేశారు. ఈ విషయమై స్పందించిన కార్పొరేటర్ సనత్ నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఫోన్ ద్వారా కాలనీ వాసులు ఎదుర్కొంటున్న నీటి సమస్యల విషయాన్ని వెల్లడించారు. ఎమ్మెల్యే తలసాని తన కార్యాలయం నుంచి వాటర్ వర్క్స్ సిజిఎం ప్రభుతో మాట్లాడి నీటి సమస్యను నివారించి కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. సనత్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, వాటర్ వర్క్స్ మేనేజర్ హిందూజాతో కలిసి తలసాని అదేశాల మేరకు పర్యటించి కాలనీలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించారు.కార్యక్రమంలో సనత్ నగర్ డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్‌రెడ్డి, కాలనీ వాసులు రామ్‌రెడ్డి,వాటర్ వర్క్స్ సూపర్ వైజర్ వీరేశ్,లైన్ మెన్ ప్రసాద్,రవి పాల్గొన్నారు.

## బిసిలకు జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్‌లు కల్పించాలి



ప్రసంగిస్తున్న డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ద డీఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, చిత్రంలో కన్వీనర్ కాటమోని వెంకటేష్

**చిక్కడపల్లి నవంబర్ 12 ( ప్రభాతవార్త):** బీసీలకు జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్ లు కల్పించాలి అని డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ద డీఫ్ నేషనల్ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, కో కన్వీనర్ కాటమోని వెంకటేష్ లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ. బీసీ లు విద్య, ఉద్యోగ,రాజకీయ,అనేక రంగాలలో వెనకబడి వునారు అన్నారు.చట్ట సభల్లో బీసీ లకు జనాభా ప్రతిపాదికన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలి అని కోరారు.

## సుందరయ్య పార్క్ ఆహ్లాదకర వాతావరణాన్ని దెబ్బతీస్తున్న వాకర్స్ క్లబ్

### -జోక్యం చేసుకోవాలని జిహెచ్‌యంసి జోనల్ కమిషనర్ కు వాకర్స్ సభ్యుల ఫిర్యాదు



జిహెచ్‌యంసి జోనల్ కమీషనర్ డాక్టర్ రవికిరణ్ ను కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న వెంకట కృష్ణ, వెంకట స్వామి గౌడ్, రాజేంద్రప్రసాద్ గౌడ్ తదితరులు సమర్పిస్తున్న వెంకట కృష్ణ, వెంకట స్వామి గౌడ్, రాజేంద్రప్రసాద్ గౌడ్ తదితరులు

**చిక్కడపల్లి నవంబర్ 12, ప్రభాతవార్త**

బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని వాకర్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ సెంట్రల్ పేరుతో ఉన్న సంస్థ దెబ్బతీస్తోందని, వెంటనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ జోక్యం చేసుకుని పార్కుకు వచ్చే వాకర్స్ కు మంచి వాతావరణాన్ని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సుందరయ్య పార్క్ వాకర్సు కోరారు. వాకర్స్ సభ్యులు వెంకట కృష్ణ (బబ్లు), రాజేంద్రప్రసాద్ గౌడ్ ,కాసాని ఆనంద్, మన్నె దామోదర్ రెడ్డి , కిషన్ రావు, వెంకటస్వామి గౌడ్, రాయపాటి రవి బుధవారం జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ డాక్టర్ రవికిరణ్ ను కలిసి సుందరయ్య పార్కులో క్లబ్ కార్యకలాపాలను అరికట్టి మంచి వాతావరణాన్ని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం ఇచ్చారు.అనంతరం వారు మాట్లాడుతూ పార్కులో కొంతమంది వాకర్స్ క్లబ్ పేరుతో రాజకీయాలు చేస్తూ ఆహ్లాదకరమైనటువంటి వాతావరణమును దెబ్బతీస్తున్నారని, దీంట్లో గ్రూపు రాజకీయాలు, ప్రాంతీయ తత్వాన్ని రెచ్చగొడుతూ పార్క్ కు వచ్చే వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని , ఫలితంగా నిత్యం పార్క్ కు వచ్చే వారు ఇక్కడి రాజకీయాలను చూసి రావడానికి ఇష్టపడడం లేదన్నారు. పార్కులో ఏ మాత్రం సంబంధం లేని కార్యక్రమాలను వాకర్స్ క్లబ్ వారు ఇక్కడినుండే కొనసాగిస్తున్నారని, క్లబ్ సమావేశాలను సుందరయ్య పార్కులో నిర్వహించడంతో పార్కు సుందరీకరణ దెబ్బతింటోందని పరిసర ప్రాంతాలు పాడవుతున్నాయన్నారు. జి.హెచ్.ఎం.సి. అధికారులు స్పందించి పార్కులో మంచి వాతావరణం కలుగజేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని, క్లబ్ కు సంబంధించిన పార్కులో ఉన్న గదిని కూడా స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రఫీ అహ్మద్, ఆర్. జయదేవ్, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ఉద్యోగులు ఆర్యోగ పరిరక్షణ కోసం జాగ్రత్త పడాలి



పోస్టర్‌ను విడుదల చేసిన టి.ఎన్.జి.ఓ అధ్యక్ష,కార్యదర్శి తదితరులు

**గన్‌ఫౌండ్రి,నవంబర్ 12ప్రభాతవార్త:** హైదరాబాద్ జిల్లాలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులందరుఅత్యంత కీలకమైన ఆరోగ్య సమస్యపై అవగాహన కల్పించడమే ఈకార్యక్రమం ముఖ్య ఉద్దేశమనితెలంగాణ నాన్ గజిటెడ్ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్,ప్రధాన కార్యదర్శి డాక్టర్ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ అన్నారు. ఈమేరకు హైదరాబాద్ టి.ఎన్.జి.ఓ జిల్లా ఆద్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా విచ్చేసి గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ అవగాహనసదస్సు పోస్టర్‌ను విడుదల చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల ఆరోగ్య,పరిరక్షణ,సంపూర్ణ శ్రేయస్సు ను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ నాన్ గజిటెడ్ హైదరాబాద్‌జిల్లా ఆద్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు ను నిర్వహించడం పట్ల ప్రత్యేక అభినందించారు. మహిళా ఉద్యోగులకు అవగాహన కల్పించడం అనేది ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తొలిమెట్టు అన్నారు.కేవలం హక్కుల కోసమే కాకుండా,ఆరోగ్య,భద్రత కోసం కూడా పాటు పడటంరాష్ట్రంలోని ఇతర యూనియన్లకు ఆదర్శప్రాయమన్నారు.ఉద్యోగినులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని పిలుపు నిచ్చారు.ఈ సదస్సు ఈనెల 25వ తేదిన నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈకార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు విక్రమ్‌కుమార్,ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ ,హైదరాబాద్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు కె.ఆర్ రాజ్ కుమార్,సత్యనారాయణగౌడ్, కొండల్‌రెడ్డి,శైలజ,ఖాలేద్ అహ్మద్,శంకర్,శ్రీధర్,ముఖమ్ ఖురేషీ వివిధ యూనిట్ల అధ్యక్షులు,కార్యదర్శులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి : రాథోడ్ సంతోష్



పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

**నిజాంపేట్, నవంబర్ 12, ప్రభాతవార్త**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న రాజీవ్ గృహకల్ప లో 53,54 బ్లాక్‌ల దగ్గర పొంగుతున్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న రాజీవ్ గృహకల్పలో 53,54 బ్లాక్‌ల దగ్గర పొంగుతున్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని నూతనంగా డ్రైనేజీ పైప్లైన్ వేసి లింకు ఇవ్వకుండా వదలడం వల్ల 53, 54 బ్లాక్ దగ్గర డ్రైనేజీ లీకేజ్ అయ్యి మూసినదిగా మారిందన్నారు. డ్రైనేజీ పొంగడంతో దుర్వాసనతోటి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొత్తగా డ్రైనేజీ లైన్ వేసిన కాంట్రాక్టర్ సరిగా వేయకపోవడం వల్లనే ఈ సమస్య ఏర్పడిందని అన్నారు. డ్రైనేజీ లీకేజ్‌తోటి రాజీవ్ గృహకల్పలో నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ లీకేజ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాజీవ్ గృహకల్పలో ఉన్న స్థానిక సమస్యల్ని ప్రభుత్వ అధికారులు సందర్శించి ఎక్కడెక్కడ ఏమేం సమస్యలు ఉన్నాయో తెలుసుకొని పరిష్కరించగలరని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు పి.స్వామి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఎంజిబిఎస్ ఆటోస్టాండ్‌ను తరలించే విషయాన్ని విరమించుకోవాలి: బోనాల



ఆటోడ్రైవర్లతో కలిసి నిరసన వ్యక్తంచేస్తున్న ప్రజా ఏక్తాపార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త

**అఫ్జల్‌గంజ్,నవంబర్ 12ప్రభాతవార్త:** సుధీర్ఘకాలంగా మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఉన్న ఆకస్మాత్తుగా ఆటో స్టాండ్‌ను తరలిస్తామని ఆర్.టి.సి అధికారుల ఆలోచన వెంటనే విరమించుకోవాలని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త డిమాండ్ చేశారు. మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఉన్న ఆటోరిక్షా డ్రైవర్లకు మద్దతు ప్రకటించారు.వారితో కలిసి నిరసన వ్యక్తం చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలనుంచే అంత రాష్ట్రాల నుంచే ప్రయాణికులను ఆటోరిక్షా డ్రైవర్లు సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరుస్తుంటారన్నారు. అసలే ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కొనసాగుతుండటంతో ఆటోరిక్షా డ్రైవర్లకు ఉపాధి కరువైందన్నారు. 150మంది ఆటోడ్రైవర్ల కుటుంబాలను రోడ్డున పడేయవద్దని ఆయన రంగారెడ్డి రీజియన్ రీజినల్ మేనేజర్ శ్రీలతను కోరారు.ఈకార్యక్రమంలో ఆటోస్టాండ్ బృందం ప్రతినిధులు ఎస్.సంతోష్‌కుమార్,ఎల్.శివకుమార్,జానునాయక్,రాము,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ,మంచినీటి సమస్యను పరిష్కరించాలని జలమండలి జిఎంకు వినతి

**బేగంబజార్,నవంబర్ 12ప్రభాతవార్త:** జాంబాగ్ డివిజన్ పరిధిలో జనాభా అనుగుణంగా మురుగునీటి కాలువలు, మంచినీటి పైపులైన్ ఆధునీకరించేందుకుగాను జలమండలి జనరల్ మేనేజర్‌కు పలు ధపాలుగా వినతిపత్రాలు అందచేసినట్లు జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ అన్నారు.రెడ్‌హిల్స్‌లోని జనరల్ మేనేజర్‌ను కలిసి అభివృద్ధి పనుల కోసం వినతిపత్రం అందచేశామన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పత్తర్‌కీమజీద్‌కుఎదురుగా ఉన్న వీధి, హిందీనగర్,హన్‌మాన్‌టేకిడి లైన్,స్వాతిదాబా లైన్ ప్రాంతాలల్లో సివరేజ్ సమస్యతోపాటు మంచినీటి పైపులైన్ ఆధునీకరించేందుకు విన్నవించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రఘు,రాజ్‌కుమార్, సందీప్,ప్రవీణ్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపరవంగా సాగిన గూడ తైలాభిషేకం

**చిక్కడపల్లి నవంబర్ 12 (ప్రభాతవార్త ):** ఆర్టీసీ క్రాస్ రోడ్స్ శ్రీ లక్ష్మి గణపతి దేవాలయంలో పవిత్ర కార్తీకమాసోత్సవాలలో భాగంగా బుధవారం బుధాష్టమి సందర్భంగా శివాలయం లో గూడ తైలాభిషేకం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మారిశెట్టి నరసింగ రావు, ఈ ఓ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు స్వామివారికి ఏకవార రుద్రాభిషేకం, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, ఆకాశదీప పూజ, కార్తీక పురాణం ప్రవచన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులచే దీపారాధన, ప్రదోష పూజ, బిల్వార్చన, నివేదన, హారతి, మహామంత్రపుష్పం, భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయం కమిటీ సభ్యులు బింగి సాయికీర్త్, శిశుకుమార్, గణేష్, డి.భా నుచందర్, జి.భాగ్యలక్ష్మి, గిరిబాబు, దినేష్, బి.నవీన్ కుమార్, పి.సురేష్ యాదవ్, గజానంద్, గణేష్, జి.లలిత, రామకృష్ణ, జి.శ్రీనివాస్, శివకుమార్, సి.హెచ్ .శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## పోటీతత్వం బాలల్లో ఆత్మస్థైర్యాన్ని ప్రతిభను చాటుతుంది : సముద్రాల వేణుగోపాలాచారి



విజేతలైన బాలలతో వేణుగోపాలాచారి, శ్రీనివాసగుప్త, అరుణఅశోక్, దైవజ్ఞశర్మ తదితర అతిథులు

**రవీంద్రభారతి, నవంబరు 12 ప్రభాతవార్త** : వివిధ అంశాల్లో పోటీలు బాలబాలికలలో సమాజంలో అత్యున్నతస్థాయికి ఎదిగేందుకు పోటీతత్వాన్ని ప్రోదిగొల్పి వారిలో ఆత్మస్థర్యాన్ని, మానసికోల్లాసాన్ని, మనోధైర్యాన్ని, నిగూఢంగా ఉన్న ప్రతిభ పాటవాలను చాటిచెబుతాయని కేంద్ర మాజీమంత్రి డా. సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. ప్రముఖ సాయి అలేఖ్య సాంస్కృతిక సంఘసేవా సంస్థ, వ్యవస్థాపకురాలు ఉపద్రష్ట అరుణ అశోక్ నేతృత్వంలో జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని చిత్రలేఖనం, సంగీత, సాహిత్య, నృత్య, వ్యాసరచన పోటీలు నిర్వహించి వారిని ఆయా రంగాల్లో ఇతోధికంగా ప్రోత్సహించి బహుమతులు అందజేయడం హర్షదాయకమని ఎంతగానో అభినందించారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సంస్థ బాలోత్సవాలు–2025 శీర్షికన వైభవోపేతంగా నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన వేణుగోపాలాచారి విశిష్ట అతిథులు ఉప్పల శ్రీనివాస గుప్త, దైవజ్ఞశర్మ, శివరాణి, ప్రియాంక తదితరులతో కలిసి ముఖ్యంగా ఈ పోటీల్లో పాల్గొని విజేతలైన పరిగి, తాండూర్, యంజాల్, వికారాబాద్, ఆలూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను బహూకరించి శుభాశీస్సులందజేశారు. ఈ సందర్భంగా బాలల సాంస్కృతిక ప్రదర్శనలు ఉర్రూతలూగించి అంబరాన్నంటాయి.

## అక్రమ నిర్మాణాలు కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

**నిజాంపేట్, నవంబర్ 12, ప్రభాతవార్త :** నిజాంపేట్ గ్రామంలోని సైదప్ప బస్తీ సర్వే నెం. 191లో అక్రమంగా వెలసిన 2 గదులను బుధవవారం తహశీల్దార్ వాణిరెడ్డి, ఆర్.ఐ భానుచందర్ సూచనల మేరకు జిపిఓలతో కలిసి ప్రభుత్వ భూమిలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా అక్రమ నిర్మాణాలకు పాల్పడితే ఎంతటివారికైన కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

## అరుంధతి నగర్ బస్తీలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపు



అరుంధతి నగర్ బస్తీ లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపు ప్రక్రియను పర్యవేక్షి స్తున్న బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ తదితరులు

**చిక్కడపల్లి నవంబర్ 12 ,ప్రభాతవార్త :**

గాంధీనగర్ డివిజన్ అరుంధతి నగర్ బస్తీ లో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని తొలగించే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలనీ స్థానిక కార్పొరేటర్ ఏ.పావని వినయ్ కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం కార్పొరేటర్ ఆదేశాల మేరకు చెత్తకుప్పలు తొలగింపు కార్యక్రమాన్ని జిహెచ్ఎంసి సిబ్బంది తొలగించారు.గత పదిహేను రోజులుగా అరుంధతి నగర్ బస్తీ లో చెత్తకుప్ప పేరుకు పోవడంతో బస్తీలో దుర్వాసన ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ కు ఫిర్యాదు మేరకు పారిశుధ్య సిబ్బంది చెత్తను తొలగించారు. బస్తీలో జరుగుతున్న నూతన సీవరేజ్ పైప్ లైన్ ఏర్పాటు రోడ్డు తవ్వకాలతో చెత్త తొలగించే వాహనాలు బస్తీలోకి వెళ్ళలేని కారణంగా చెత్త తొలగించలేదని, ఇక నుండి ప్రతి రోజు సిబ్బంది చెత్త తొలగిస్తారని కార్పొరేటర్ వివరించారు. కార్పొరేటర్ ఆదేశాలతో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ బస్తీ వాసులకు వివరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వి .నవీన్ కుమార్, ఓబీసీ మోర్చ అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్, బస్తీ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్ యాదవ్,స్వామి దాస్, శ్రీనివాస్ గౌడ్,చెందెర్ తదితరులు పాల్గొన్నారు.

## లాడ్జీల పరిసర ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి - డిసిపి రష్మి పెరుమాల్



సికింద్రాబాద్‌లోని లాడ్జీల నిర్వాహకులు,మేనేజర్లతో సమావేశమైన డిసిపి సాధన రష్మి పెరుమాల్

**కంటోన్మెంట్,నవంబర్ 12 ప్రభాతవార్త:** లాడ్జీలు, రెస్టారెంట్‌లు,హోటల్స్ పరిసర ప్రాంతాల్లో నిర్వాహకులు సీసీటీవి కెమెరాలను తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని ఉత్తర మండలం డిసిపి రష్మి పెరుమాల్ తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల లాడ్జ్‌లు,హోటల్స్,రెస్టారెంట్‌ల నిర్వాహకులు, మేనేజర్లతో సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. వివిధ పనుల కోసం హైదరాబాద్‌కు వచ్చి లాడ్జీలలో ఉండేందుకు వచ్చే వారి ఆధార్ కార్డులు, సెల్‌ఫోన్ నెంబర్,అడ్రస్‌లు పూర్తిగా తీసుకొని లాడ్జీలకు వచ్చి పోయే వారి వివరాలను రికార్డులు మెంటెన్ చేయాలన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
సంక్షిప్త టెండర్ ప్రకటన: No. 48/EE. Div. No.9/GHMC/2025-26 తేది: 11.11.2025
నిట్ నం. ఫైన పేర్కొన్నది. పని వివరణ: నిర్వహణ పనులు (04) నం.లు. అంచనా మొత్తం: రూ.లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు. సమయం: ప్రారంభ తేదీ: 12.11.2025 మ.03.00గం. స్వీకరణకు చివరి తేదీ, సమయం: 15.11.2025 మ.03.00గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం.: శ్రీ జి. హరికిషోర్ 9849906768
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-9, CRZ, GHMC.
DIPR.NO.10546-PP/CL/ADVT/1/2025-26 తేది: 12.11.2025



THE COURT OF THE HONBLE XXV ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD
I.A.No. 1203 of 2023 IN O.S. No. 512 of 2023
BETWEEN:
**Guduru Chandrakala**
Rep.by her GPA Holder ... Petitioner/ Plaintiff
AND
**B. Pushpender** & Others .. Respondents/Defendants
To,
**(R-5) Beni Ashish Sharma,** S/o. Gopal Sharma, Aged about 37 years, Occupation: Business, R/o. Flat No. G-1, Jagannath Residency, Himayath Nagar, Hyderabad-500 029.
**(R-15) Ankit Madhusudan Agrawal,** S/o. Madhusudan Agrawal, Aged about 37 years, Occupation: Pvt. Employee, R/o. Flat No. 305, Jagannath Residency, Himayath Nagar, Hyderabad-500 029.
**(R-25) D. Sathya Sridhar,** S/o. D. Ranga Rao, Aged about 51 years, Occupation: Employee, R/o. Flat No. 305, Jagannath Residency, Himayath Nagar, Hyderabad-500 029.
**(R-30) M/s OM CONSTRUCTIONS,** a Partnership Firm Rep. by its Managing Partner Sri. C. Venkateshwar Rao S/o. Late. C. Ramaiah, Aged 59 years, Occupation: Business, R/o. 3-5-850, Hyderguda, Hyderabad
Sir/Madam,
That the petitioner/plaintiff has filed the above suit against you and others for partition and separate possession in respect of the below metnioned petition schedule property. Wherein the above interlocutory applicaton was filed for seeking interim injunction order by restraining you and other respondents herein from alienating the petition schedule property to the third parties pending disposal of the main suit and now the matter is posted on **12-12-2025** for your appearance. Hence, you are hereby required to appear before said Court on **12-12-2025 at 10: 30 AM** either personally or through an Advocate, otherwise the matter will be decided exparte.
**PETITION SCHEDULE PROPERTY**
All that all that all that Residential Apartment by name JAGANNATH RESIDENCY' consisting of Cellar for Parking, Ground + 4 Floors) in ground floor Flats bearing Nos. G1,G2, G3, G4, G5 & G6), in First floor Flats bearing Nos. 101, 102, 104, 105 & 106, in Second floor Flats bearing Nos. 201, 202, 203, 204, & 206, in third floor Flats bearing Nos. 301,302, 304,305 & 306 and in Fourth Floor Flat bearing No. 401, constructed in premises bearing Municipal No. 3-5-845 to 3-5-852, admeasuring 1575 Sq. Yards., situated at Hyderguda, Hyderabad, and bounded by: **North:** Property of K. Lingalu and Jai Chand Lohade, **South:** Neighbour's house **East:** Neighbour's house, **West:** Property of Dr. Kurien.
"BY ORDER OF THE COURT"
**M/S G.SUDHAKAR REDDY,** Advocates
Plot No. 131, Sai Ram Nagar Colony, Champapet, Hyd-79. **Ph. 9848470673**
Counsel for Petitioner/ Plaintiff



IN THE COURT OF THE HON'BLE 1ST ADDITIONAL DISTRICT JUDGE, RANGA REDDY DIST AT: L. B. NAGAR
E.P.NO. 4 OF 2018 IN O.S.NO.1132 OF 2008
BETWEEN:
1. Poreddy. Ram Reddy DIED
2. P.Mallareddy S/o Late P.Ramreddy ...Petitioner
AND
Sam Reddy, Satli Reddy & others ...Respondents
To,
15. **Mounika** D/o Late. Boyapally Papi Reddy , R/o H.No. 4-61, R/o Almanguda Village, Balapur Village, R. R. District.
16. **Ramidi Janga Reddy** S/o Late. Ram Reddy
17. **Ramidi Narsimha Reddy** S/o. Ram Reddy.
18. **Ramidi Sathi Reddy** S/o Ram Reddy
19. **Ramidi Sanjeeva Reddy** S/o. Late Rami Reddy
**Respondents No.16 to 19 are R/o H.no: 2-24/2, Almasguda Vill, Balapur Mdl, Ranga Reddy Dist.**
20. **Kolanu Muthyam Reddy** S/o. Late Venkat Reddy R/o H.No.1-41 Almasguda Vill, Balapur Mdl, Ranga Reddy Dist.
22. **Yamjal Mohan Reddy** S/o. Bal Reddy R/o.H.No 2-83, Almasguda Vill, Balapur Mal, Ranga Reddy District ..Respondents
NOTICE
Please take notice that the above named decree holder have filed E.P.No.4/2018 against the judgment debtors for execution of the decree dated 19-11-2010 passed by this Hon'ble court in O.S.NO. 1132/2008 for seeking delivery of possession in respective of E.P.Schedule properties and the matter is posted for appearance of above numbered respondents and if all of you have any objections you all are may be appear before Hon'ble I Addl. District Judge Court, R.R.District, At: L.B.Nagar, on **03-12-2025 at 10:30 am** either in person or through an advocate duly instructed by you with all relevant documents failing which the matter will be decided on merits against all of you.
**SCHEDULE OF PROPERTY:** All that the open plots bearing Plot No 575 adm. 173 Sq. yards, Plot No.576 adm. 173 Sq. yards, 582 adm. 267 Sq. yards, Plot No. 583 adm. 267 Sq. yards, Plot No.606 adm. 267 Sq. yards, Plot No.607 adm. 267 Sq. yards, Plot No.631 adm. 267 Sq. yards, Plot No.632 adm. 267 Sq. yards, Plot No.650 adm. 260 Sq. yards, Plot No.705 adm. 267 Sq. yards, Plot No. 731 adm. 267 Sq. yards, Plot No. 732 adm. 267 Sq. yards, Plot No.750 adm. 267 Sq. yards, Plot No.751 adm. 267 Sq. yards, Plot No.738 adm. 267 Sq. yards, Plot No.760 adm. 180 Sq. yards, Plot No.761 adm. 267 Sq. yards, Plot No. 800 adm. 267 Sq. yards, Plot No.801 adm. 267 Sq. yards, and total 15 plots and total adm. 4787 Sq. yards in Sy. No's 98,99,100,101 & 112 situated at Almasguda Village, Saroornagar Mandal, Ranga Reddy District.
// BY ORDER OF THE COURT //
Smt.G.Vijayalakshmi
N.Raveender
Advocates
Hyderabad
Cell no. 9291492041,9440898521



BEFORE THE HON'BLE VII SENIOR CIVILJUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD
O.S. NO. 1391 OF 2025
BETWEEN:
**Y L N Prasad& 2 Others** ...Plaintiffs
AND
**All Concerned & 3 Others** ...Defendants
**NOTICE ISSUED TO ALL CONCERNED**
Please note that,
The Plaintiffs have filed a suit bearing O.S. No. 1391 of 2025 on the file of the ***Hon'ble VII Senior Civil Judge, City Civil Court, At Hyderabad***, seeking to declare the Plaintiffs 1 to 3, as the only Legal Heirs of Late Y. Vagdevi and consequently declare the Plaintiffs 1 to 3 as the Successors and possessors of the Suit Schedule Properties.
The said matter is posted on **23.12.2025** for filing objections, if any. Therefore, any person or persons having any objection or claim in respect of the said matter are hereby informed to appear before the ***Hon'ble VII Senior Civil Judge, City Civil Court, At Hyderabad*** at **10:30 A.M.** on **23.12.2025.**
In the event of non-appearance, the matter will be decided in your absence.
**SUIT SCHEDULE PROPERTIES**
**SUIT SCHEDULE PROPERT-A**
All that the Semi-finished Residential Flat No. 503 on Fifth Floor of "LAKSHMI SRI SAI NIVAS" admeasuring 1906 sq.ft., including common areas and car parking together with Undivided Share of Land admeasuring 35 sq.yds., out of 1200 sq.yds., in premises bearing Municipal No. 2-2-20/20 on Plot No. 10, in Survey No. 48/1, Block-D, situated at D.D Colony, Bagh Amberpet, Hyderabad, and the said flat is bounded by:
North : Open to Sky & Corridor
South : Open to Sky
East : Corridor
West : Open to Sky
**SUIT SCHEDULE PROPERT-B**
Flat No.206, consisting built up area of 1100 sft, in First Floor of the residential complex "SAI KALYAN APARTMENTS", constructed in Schedule Property A with an undivided share of 40 Sq. yds or 33.44 Sq.mtrs, out of it's total land area of 1042 Sq.yds or 33.44 Sq. mtrs, out of it's total land area of 1042 Sq. yds or 871.11 Sq.mtrs, and the said Flat is bounded by:
North : Open space of the Complex,
South : Corridor,
East : Open space of the Complex,
West : Open space of the Complex
**SUIT SCHEDULE PROPERT-C**
All that land in Sy. No. 942, Plot No. 17, Plot No. 23, 24, Extent: 400.500 Sq. Yds. situated at Kodada Village, Kodada Mandal, Suryapet District, 508 206.
North : Road
South : Plot No. 25
East : Road
West : Plot No. 21
**MADHURYA DEEKONDA ADVOCATE**
G Block-504, Jal Vayu Towers, Kavadiguda, Hyderabad, 500080
**Cell. No: +91 7893678928**



THE COURT OF THE HONBLE XXV ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD
O.S. No. 512 of 2023
BETWEEN:
**Guduru Chandrakala**
Rep.by her GPA Holder ... Plaintiff
AND
**B. Pushpender** & Others .. Defendants
To,
**(D-5) Beni Ashish Sharma,** S/o. Gopal Sharma, Aged about 37 years, Occupation: Business, R/o. Flat No. G-1, Jagannath Residency, Himayath Nagar, Hyderabad-500 029.
**(D-15) Ankit Madhusudan Agrawal,** S/o. Madhusudan Agrawal, Aged about 37 years, Occupation: Pvt. Employee, R/o. Flat No. 305, Jagannath Residency, Himayath Nagar, Hyderabad-500 029.
**(D-25) D. Sathya Sridhar,** S/o. D. Ranga Rao, Aged about 51 years, Occupation: Employee, R/o. Flat No. 305, Jagannath Residency, Himayath Nagar, Hyderabad-500 029.
**(D-30) M/s OM CONSTRUCTIONS,** a Partnership Firm Rep. by its Managing Partner Sri. C. Venkateshwar Rao S/o. Late. C. Ramaiah, Aged 59 years, Occupation: Business, R/o. 3-5-850, Hyderguda, Hyderabad Sir/Madam,
That the plaintiff has filed the above suit against you and others for partition and separate possession in respect of the below mentioned suit schedule property and the present case is posted on **12-12-2025** for your appearance. Hence, you are hereby required to appear before said Court on **12-12-2025 at 10: 30 AM** either personally or through an Advocate, otherwise the matter will be decided exparte.
SUIT SCHEDULE PROPERTY
All that all that all that Residential Apartment by name JAGANNATH RESIDENCY' consisting of Cellar for Parking, Ground + 4 Floors) in ground floor Flats bearing Nos. G1,G2, G3, G4, G5 & G6), in First floor Flats bearing Nos. 101, 102, 104, 105 & 106, in Second floor Flats bearing Nos. 201, 202, 203, 204, & 206, in third floor Flats bearing Nos. 301,302, 304,305 & 306 and in Fourth Floor Flat bearing No. 401, constructed in premises bearing Municipal No. 3-5-845 to 3-5-852, admeasuring 1575 Sq. Yards., situated at Hyderguda, Hyderabad, and bounded by: **North:** Property of K. Lingalu and Jai Chand Lohade,**South:** Neighbour's house **East:** Neighbour's house, **West:** Property of Dr. Kurien.
"BY ORDER OF THE COURT"
**M/S G.SUDHAKAR REDDY,** Advocates
Plot No. 131, Sai Ram Nagar Colony, Champapet, Hyd-79. **Ph. 9848470673**
Counsel for the Plaintiff



IN THE COURT OF THE HON'BLE III ADDL. JUNIOR CIVIL JUDGE - Cum - X ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, AT: MEDCHAL
O.S.No. 823 of 2025
Between:
**Ravalkol Shankar** & others ...Plaintiffs
AND
**The Tahsildar,** Medchal, Medchal -Malkajgiri District & Others ...Defendants
NOTICE
To,
1. **The Tahsildar,** Medchal, Medchal - Malkajgiri District.
2. **All Concerned**...Defendants
Please take notice that the above named plaintiff has filed the above SUIT FOR DECLARATION OF LEGAL HEIRS against you in the III Addl. Junior Civil Judge, at Medchal. The Hon'ble Court has directed notice through paper publication against you. The above case stands posted on **24-12-2025 at 10:30am** for your appearance before the Hon'ble Court. If you fail to appear on that day, the matter will be heard and decided ex-parte.
**(By Order of the Hon'bleIII Addl. Junior Civil Judge, at Medchal )**
Address for service:
**Janga Srikanth Yadav,** B.A., LL.B., LL.M., MCJ,
**M Sai Kiran Goud,** B.A., LL.B.,
**Advocate(s),**
# 101, Ambika Nilayam, Backside Shivalayam Temple, KLR Venture Road, Medchal, Medchal-Malkajgiri, Hyderabad - 501 401.
**Ph.No. 8686863259**



IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE: MEDCHAL-MALKAJGIRI DISTRICT AT: L.B.NAGAR
O.S.No. 1245 OF 2025
Between:
**Smt. Moluguri @ Pola Karunamma and Others** ...Plaintiffs
And
1. **The Thahsildar, Uppal (M) Medchal-Malkajgiri Dist.**
2. **All Concerned ...Defendants**
To
**All Concerned**
The Plaintiff above named Plaintiff has filed the above suit for Declaration to declare that the Plaintiffs are legal heir of deceased late Pola Santhosh, and for that reason, you are hereby called upon to be present in person or through your counsel duly instructed on the **26th day of November, 2025 at 10-30 a.m.** before the said court, failing which the above Suit will be decided against you.
**SCHEDULE OF PROPERTY**
All that part and parcel of Flat No.409, with a plinth area of 545 square feet, 01 BHK, Tower No. D05 in the name and style of 'Sahabhavana Township', situated at Bndlaguda, Uppal Mandal, Medchal-Malkajgiri District, bounded by: **North:** Electrical Duct, **South:** Flat No.410, **East:** Open to Sky, **West:** Corridor.
//BY ORDER OF THE COURT//
**B. BHUSHAN GUPTHA**
**Advocate**
P.No.3, Andhra Bank Building, BN. Reddy Nagar, R.R. District, Hyderabad, **Cell: 9959316146**



IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL SENIOR CIVIL JUDGE AT: HYDERABAD
O.S.NO. 1106 OF 2025
Between:
**Mrs. Mallula Bramaramba & others** ...Plaintiffs
And
**All Concerned & another** ...Defendants
To,
**ALL CONCERNED (Defendant no.1 in the suit)**
This is to bring to your kind notice that plaintiffs filed the present suit against you and the said proceedings stands posted to **02.12.2025.** You are hereby called upon to appear before the court of Hon'ble II Addl. Senior civil Judge, Hyderabad, on dt **02.12.2025 at 10.30 A.M** failing which the court shall proceed with the next step in the matter.
**SCHEDULE OF PROPERTY**
vide plot no.249 admeasuring 500 Sq.Yds. forming part of the Survey No.112,113 & 114, Thattiannaram village, Hayat Nagar Mandal, Ranga Reddy district and bounded by:
**North:** Plot No. 250
**South:** Plot No.248
**East :** 40' wide Road
**West:** Plot No.240
// Issued under the Orders of the Court /
**A. SRINIVAS REDDY**
**ADVOCATE**
H.NO. 6-1-190/6, MEHER NIVAS, OPP. UMA'S HIGH SCHOOL, PADMARAO NAGAR, SECUNDERABAD-500025
**MOBILE: 9247140685**



IN THE COURT OF THE HON'BLE 2ND ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURT: AT: HYDERABAD.
O. S. No. 490 of 2025.
Between:
**Smt. Farhana Khan & another.** ...Plaintiffs.
And
**Tahasildar & others.** ...Defendants.
To,
1. **THE TAHASILDAR,** Bagh Amberpet Tahasil Office, Bagh Amberpet Mandal, Hyderabad-500013, T.G.S.
2. **ALL CONCERNED.**
**NOTICE**
Please take Notice that the above named Plaintiffs filed the case against the Defendants and others in O.S. No. 490 of 2025, Suit for Declaration of Legal heirs of Late MAHAMOOD ALI KHAN and the same is posted to **25-11-2025** for your Appearance and Answer. So the Defendants are hereby directed to appear in person or through an Advocate on **25-11-2025 at 10-30 A.M.** before this Hon'ble 2nd Addl. Chief Judge, City Civil Court at Hyderabad, failing which the matter will be disposed off in accordance with law.
(By the ORDER of Court)
**Sd/- MOHD. ABDUL SATTAR KHAN**
**Advocate**
# 3-15-125/27, Flat No.101, Kamala Nagar, Street No.3, Near Sahara Estates Gate No.1, Mansoorabad, Hyderabad-500068.
**Cell No. 9849361808**

## ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి -కార్పొరేటర్ బొక్కా భాగ్యలక్ష్మి


రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొక్కా భాగ్యలక్ష్మి తదితరులు

**మలక్ పేట ,నవంబర్ 12, ప్రభాతవార్త:** ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడానికి కృషి చేస్తున్నామని ముసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్కా భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్ లోని శ్రీపురం కాలనీలో రూ. 14 లక్షలతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణం పనులను స్థానిక కాలనీ వాసులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటివరకు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని, త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి ప్రణాళికలను రూపొందించనునట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఇ శరత్ రెడ్డి, సైట్ ఇంజనీర్ ఏడుకొండలు, వర్క్ ఇన్ స్పెక్టర్ సత్తిరెడ్డి, నాయకులు కొప్పుల దినేష్, కొండారెడ్డి, సురేందర్, పరశురాం నాయక్, సురేష్, ఉమేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి : ఎస్ఐ సంజీవరెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్ఐ సంజీవరెడ్డి, చిత్రంలో ప్రిన్సిపల్ అప్పారావు తదితరులు

**మలక్ పేట ,నవంబర్ 12, ప్రభాతవార్త:** విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని మలక్ పేట ఎస్ఐ సంజీవరెడ్డి పేర్కొన్నారు. ముసారాంబాగ్ లోని అవంతి పిజి కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కార్యక్రమం పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఐ సంజీవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ కు దూరంగా ఉండాలని, శారీరకంగా, మానసికంగా ఎవరిని వేధించవద్దని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ చదువుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. విద్యార్థులు సైబర్ క్రైమ్స్, డిజిటల్ అరెస్ట్ తదితర వాటిపై అవగాహన పెంపొందించుకొని మోసానికి గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ అప్పారావు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని వివరించారు. విద్యార్థులకు అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు పరిశీలించిన కార్పొరేటర్



**మల్కాజిగిరి నవంబర్ 12, ప్రభాతవార్త:** ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ ఉప్పలమ్మ గుడి దగ్గర 11 లక్షలతో కొనసాగుతున్న యు జి డి మరియు 10 లక్షలతో కొనసాగుతున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్, కాలనీవాసులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సిసి రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, కిషోర్, కాలనీవాసులు అశోక్ రాందాస్, భాస్కర్, ప్రభాకర్, ప్రమీల, శ్యాం కుమార్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బిహెచ్ కాలనీలో కార్తీకమాస ఉత్సవాలు


పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, నవంబరు 12 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ ఎస్‌బిహెచ్ కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో కార్తీకమాసం సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాలలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కోటి దీపోత్సవం, శ్రీ వీరభద్ర స్వామి కళ్యాణ మహోత్సవంలో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన ఏఎంసి వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్


ఏఎంసి వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**సైదాబాద్, నవంబరు 12 ప్రభాతవార్త:** హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ బుధవారం మర్యాద పూర్వకంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసారు. ఈ సందర్భంగా కోట్ల శ్రీనివాస్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ అభివృద్ధి కోసం మరింత కృషి చేయాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు.

## మలక్ పేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నాం : ఎమ్మెల్యే బలాల



ఓల్డ్ మలక్ పేట్ లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

**మలక్ పేట ,నవంబర్ 12, ప్రభాతవార్త:** మలక్ పేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ఓల్డ్ మలక్ పేట్ డివిజన్ లోని పలు ప్రాంతాలలో రూ. 4.12 కోట్లతో నిర్మించనున్న నూతన సీసీ, బిటి రోడ్లు, నూతన సీసీ బాక్స్ డ్రైయిన్, నూతన రిటైనింగ్ వాల్, కమ్యూనిటీ హాల్ తదితర నిర్మాణం పనులను ఎమ్మెల్యే అహ్మద్ బలాల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం జరిగిందని వివరించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. నియోజకవర్గంలో త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి ప్రణాళికలను రూపొందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు సైఫుద్దీన్ షఫీ, నాయకులు ఆలీం, అన్వర్ తదితరులతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డాక్టర్స్ కాలనీలో అక్రమ నిర్మాణాల కూల్చివేత


అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు



**హుడా కాంప్లెక్స్, నవంబర్ 12, ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం , సరూర్ నగర్ డివిజన్ పరిధిలోని డాక్టర్స్ కాలనిలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ఇండ్లను బుదవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. సరూర్ నగర్ మండల తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం డాక్టర్స్ కాలనీలోని సర్వే నంబర్ 9/1 లోని 3 ఏకరాల భూమి విషయంలో ప్రభుత్వానికి, మొహమ్మద్ రహీం అండ్ 5 అదర్స్ మధ్య కోర్టులో వివాదం నడుస్తుంది. కాగా 2015లో హై కోర్టు భూమిని పోసిషన్ చేసుకోవాలని ఆదేశించిందని , 2021లో ఈ స్థలానికి ఫెన్సింగ్ వేయటం జరిగిందని తెలిపారు. వేసిన ఫెన్సింగ్ కూడా అక్రమ నిర్మాణదారులు తొలగించడం జరిగిందన్నారు. ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ ప్రకారం ఆర్ డి ఓ ఆదేశాల మేరకు అక్టోబర్ 29న వన్ వీక్ నోటీస్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. నోటీస్ స్పందించక పోవడంతో బుదవారం ఉదయం సరూర్ నగర్ పోలీస్ ప్రొటెక్షన్ తో ఇండ్లను ఖాళీ చేయించి, కూల్చి వేయడం జరిగిందని తెలిపారు. ఈ కూల్చివేతల్లో డిప్యూటీ తహసీల్దార్ జంగయ్య, ఆర్ఐలు సహదేవ్ రెడ్డి, గీత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నగదు, బంగారు ఆభరణాలను దొంగలించిన ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

### -రూ.7 లక్షల విలువ గల బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, బంగారు ఆభరణాల దృశ్యం


వివరాలను వెల్లడిస్తున్న ఎసిపి సుబ్బారామి రెడ్డి, చిత్రంలో ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్ తదితరులు

**మలక్ పేట ,నవంబర్ 12, ప్రభాతవార్త:** వృద్ధ దంపతుల వద్ద సహాయకులుగా పనిచేస్తూ రూ. నాలుగు లక్షల నగదు, సుమారు 7 లక్షల విలువ గల పది తులాల బంగారు ఆభరణాలను దొంగలించి పారిపోయిన భార్యాభర్తలను పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మలక్ పేట ఏసిపి సుబ్బరామిరెడ్డి కథనం ప్రకారం.. మలక్ పేటలో నివసిస్తున్న వృద్ధ దంపతులు కే. నాగేంద్రరావు (84), సీతామహాలక్ష్మి (83)ల కోసం సహాయకులుగా రవిరాం, పద్మ జంటను 2023లో నియమించుకోవడం జరిగింది. కాగా 2025 అక్టోబర్ 10వ తేదీన వృద్ధ దంపతులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళ్లి అదే రోజు రాత్రి 9 గంటలకు తమ నివాసానికి వచ్చారు. మరుసటి రోజు వారికి సహాయకులుగా ఉన్న జంట రవిరాం, పద్మ లు తమ సొంత ఊరు వెళ్తున్నామని, ఉద్యోగం మానేస్తున్నామని వృద్ధ దంపతులకు తెలియజేశారు. అక్టోబర్ 31 తేదీన ఖాళీ చేసి వారు వెళ్ళిపోయారు. కాగా నవంబర్ ఒకటో తేదీన వృద్ధ దంపతులు తమ నివాసంలోని అల్మారాలో ఉంచిన నాలుగు లక్షల నగదు, సుమారు పది తులల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో తమకు సహాయకులుగా పనిచేసిన రవి రామ్, పద్మజంటపై అనుమానం వచ్చింది. దీంతో వారి కుమారుడు గోపీచంద్ నవంబర్ 4వ తేదీన మలక్ పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మలక్ పేట్ ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ప్రారంభించి నిందితులు రవిరాం, పద్మ జంటను అదుపులోకి తీసుకుని విచారించారు. తాము దొంగతనం చేసామని అంగీకరించడంతో వారి వద్ద నుంచి రూ. ఏడు లక్షలు విలువగల బంగారు ఆభరణాలు, నగదు ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇన్చార్జ్ డిసిపి స్నేహ మిశ్రా పర్యవేక్షణలో ఏసీపీ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్, డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ ఉదయ శంకర్ లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా ప్రారంభమైన ఎన్‌పిఎల్ క్రీడా పోటీలు


ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎసిపి, నారాయణ ఎజిఎం, వివిధ బ్రాంచుల ప్రిన్సిపాళ్లు

**సరూర్‌నగర్, నవంబర్ 12 ప్రభాతవార్త:** నారాయణ వనస్థలిపురం జోన్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్‌పిఎల్ (నారాయణ ప్రీమియర్ లీగ్) పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎల్‌బినగర్ జోన్ ఎసిపి కృష్ణయ్య క్రీడా జ్యోతిని వెలిగించి బెలూన్లను వదిలి ఎన్‌పిఎల్ పోటీలకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి పోటీల వల్ల విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని అన్నారు. అదే విధంగా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు కూడా పెరుగుతాయని తెలిపారు. కాగా క్రీడా పోటీల సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎన్‌పిఎల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నారాయణ వనస్థలిపురం జోన్ ఎజిఎం రవీంద్రబాబు, మీర్‌పేట్ నారాయణ ప్రిన్సిపాల్ బాబ్జి, ఫలక్‌నుమా, జల్‌పల్లి, కొత్తపేట్, వనస్థలిపురం, హయత్‌నగర్ బ్రాంచిల ప్రిన్సిపాళ్లు నౌషిన్ ఫాతిమా, రవికుమార్, మాధవి, భువనేశ్వరి, నాగరాణి, లావణ్య, మానసలతో పాటు వైస్ ప్రిన్సిపాళ్లు, ఎఒలు, పిఇటిలు, ఆర్‌పి, ఆర్‌అండ్ హెడ్స్, కో ఆర్డినేటర్లు, సాఫ్ట్ స్కిల్స్ జోజిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సాయిరాంకాలనీలో బాక్స్‌డ్రైన్ పనుల పరిశీలన


చిలుకానగర్‌లో సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, నవంబరు 12 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ సాయిరాంనగర్ కాలనీలో రూ.96 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బాక్స్ డ్రైన్ పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సాయిరాంనగర్ కాలనీలో బాక్స్ డ్రైన్ నిర్మాణ సమయంలో జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షణ ఉండాలని, కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. కాలనీలో ఉండే ప్రజలకు బాక్స్ డ్రైన్ నిర్మాణ సమయంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి డిఇ వినీల్ గౌడ్, ఏఈ రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నేతలు ఏదుల కొండల్‌రెడ్డి, కొక్కొండ జగన్, శ్యామ్, బంటిగౌడ్, సాయిరాం నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు నరసింహా, నర్సింగ్ రావు,రూబీ తదితరులు పాల్గొన్నారు.

## లార్డ్స్ పాఠశాలల్లో విజయవంతంగా క్రీడో కార్యక్రమాలు


క్రీడో ద్వారా నేర్చుకున్న అంశాలను వివరిస్తున్న విద్యార్థులు

**సరూర్‌నగర్, నవంబర్ 12 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఆర్‌ఎన్‌రెడ్డి నగర్‌లోనున్న లార్డ్స్ పాఠశాలలో బుధవారం క్రీడో కార్యక్రమాన్ని నిర్వహించారు. లార్డ్స్ విద్యా సంస్థల్లో చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బెర్ల శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించబడి విజయవంతంగా ముందుకు సాగుతున్న ఈ క్రీడో కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు తాము అభ్యసించిన అంశాలను చక్కగా వివరించారు. క్రీడో కార్యక్రమం కింద తర్ఫీదునిచ్చిన శిక్షకులు విద్యార్థుల ప్రతిభా పాటవాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిషన్ రావు, ఇంఛార్జి సంధ్యారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి పిహెచ్‌సిలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



**నేరేడ్ మెట్, నవంబర్ 12,ప్రభాతవార్త:** ప్రభుత్వ వైద్యశాఖ ప్రజారోగ్యానికి అంకితభావంతో ముందుకు సాగుతున్న మరో ఉదాహరణగా మల్కాజ్గిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విద్యార్థులకు ఉచిత దంత, ఈఎన్టీ వైద్య పరీక్షలు నిర్వహించబడ్డాయి. పాఠశాల స్థాయిలోనే ఆరోగ్య సమస్యలను గుర్తించి చికిత్స అందించడం లక్ష్యంగా జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్, నేరేడ్మెట్ విద్యార్థులపై వైద్య పరీక్షలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.మొత్తం 35 మంది విద్యార్థులను పరీక్షించగా, 26 మందికి పాడైన దంతాల సమస్యలు ఉన్నట్లు తేలింది. వీరికి ఫిల్లింగ్స్, ఎక్స్ట్రాక్షన్ వంటి చికిత్సలు మల్కాజ్గిరి పిహెచ్సీలోని ఆధునిక దంత వైద్య విభాగంలో నిర్వహించబడినవి. ఈ సేవలను అందించిన దంత వైద్య నిపుణుడు డాక్టర్ వినోద్ కృషిని ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులు ప్రశంసించారు.అలాగే ఎంహెచ్‌టీ-1 నుండి రిఫరల్ ఆధారంగా వచ్చిన నాలుగు మంది ఆర్‌బిఎస్‌కే విద్యార్థులు కూడా దంత చికిత్స పొందినట్లు అధికారులు తెలిపారు. గ్రామీణ స్థాయిలో ఇలాంటి సమగ్ర ఆరోగ్య సేవలు అందించడం ప్రజలకు ఎంతో దోహదపడుతుందని స్థానికులు అభినందించారు.ఈ కార్యక్రమంలో దంత వైద్య నిపుణుడు డాక్టర్ వినోద్, ఆర్‌బిఎస్‌కే వైద్యులు, పిహెచ్సీ సిబ్బంది పాల్గొన్నారు.

## సౌట కుంటను పరిశీలించిన హైడ్రా అధికారులు


వివరాలు సేకరిస్తున్న సీఐ

**హయత్ నగర్, నవంబర్ 12 ప్రభాతవార్త:** పెద్ద అంబర్ పేట సర్వేనెంబర్ లోని సౌటకుంట ఎఫ్ టీ ఎల్ బఫర్ జోన్ పరిధిలో అక్రమంగా ఫంక్షన్ హాల్, గోదాముల నిర్మాణాలు చేపట్టారన్న ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు బుధవారం విచారణకు వచ్చారు. ఈ సందర్భంగా పిర్యాదుదారు గంట అనుపమా లక్షారెడ్డి హైడ్రా అధికారి కి సంబంధిత పత్రాలను చూపారు.ఈ సందర్భంగా హైడ్రా సీ ఐ మాట్లాడు తూ.. గోదాములు, ఫంక్షన్ హాల్ కి సంబంధించిన అనుమతి పత్రాలు కుంట విస్తీర్ణం, బఫర్ జోన్ కి సంబంధించిన వివరాలను పరిశీలించి నివేదికను కమిషనర్ కు అందిస్తామని తెలిపారు.

## కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించాలి


తాసిల్దార్‌ను సన్మానిస్తున్న సురేందర్‌యాదవ్

**ఎల్.బి.నగర్, నవంబర్ 12 ప్రభాతవార్త:** నాగోల్ డివిజన్ పరిధిలోని దేవిరెడ్డి సుధీర్‌రెడ్డినగర్ కాలనీలో నూతన కమ్యూనిటీ హాల్ భవనం మంజూరు అయిన సందర్భంగా స్థలం కేటాయించాలని, భవన నిర్మాణ అనుమతి ఇవ్వాలని బిజెపి ఓబీసీ మధ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ నూతన తహసిల్దార్ పవాల్‌సింగ్‌చౌహాన్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కమ్యూనిటీ హాల్ నిర్మాణం అత్యంత అవసరం అన్నారు. ఈ భవనం నిర్మాణం పూర్తి అయితే కాలనీ ప్రజలకు సామూహిక కార్యక్రమాలు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఎస్ఆర్ కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, జనరల్ సెక్రటరీ విష్ణుచారి, సభ్యులు సైదులు, ఎల్లయ్య, పాల్గొన్నారు.

## బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బొడ్డుపల్లి కృష్ణ

**ఎల్.బి.నగర్, నవంబర్ 12 ప్రభాతవార్త:** ఖమ్మం జిల్లాలో డిసెంబర్ 26వ తేదీన జరిగే అఖిలభారత స్థాయి బహిరంగ సభ విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర ప్రజా సంఘాల సబ్ కమిటీ సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ విజ్ఞప్తి చేశారు. బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం న్యూ నాగోల్ లోని ప్రజాసంఘాల కార్యాలయం ఎస్సీ డాంగే భవన్లో బుధవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం బానిసత్వంలో ఉన్నప్పుడు పీడిత ప్రజల విముక్తి కోసం అనేక వీరోచిత పోరాటాలు జరిపి వాటికి నాయకత్వం వహించి అమరులైన వీరుల త్యాగాలతో శతవసంతాలు పూర్తి చేసుకుంటున్న సిపిఐ పార్టీ నిరంతరం ప్రజల కోసం పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. ఉజ్వల పోరాట ఘట్టాలు, వెలకట్టలేని త్యాగాలు, పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన జండా సిపిఐ శతవసంతాలు వర్ధిల్లాలని పిలుపునిచ్చారు. ఉప్పల్ మండల సిపిఐ పార్టీ కౌన్సిల్ సభ్యులు ఉడుతల మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గోపాల్, ఎస్ .సైదారావు, పి .మల్లేష్, బి .రాము, కె .జయశంకర్. తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్లో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన


బోడుప్పల్ కార్పొరేషన్ చెంగిచెర్లలో డ్రైనేజ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మాజీ మేయర్ అజయ్ యాదవ్ మాజీ కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్, ప్రభాకర్ గౌడ్ ,విక్రమ్ గౌడ్ మాజీ ప్రజా ప్రతినిధులు

**బోడుప్పల్, నవంబర్ 12 ప్రభాతవార్త :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూడవ డివిజన్ చెంగిచెర్ల లో రాఘవేంద్ర హోటల్ నుండి ఎం ఎల్ ఆర్ కాలనీ వరకు ఒక కోటి రూపాయల నిధులతో డ్రైనేజీ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్ గౌడ్ , మాజీ కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు సుమన్ నాయక్ , కుంభం కిరణ్ కుమార్ రెడ్డి , కో ఆప్షన్ సభ్యులు రంగా బ్రహ్మన్న గౌడ్ , కాంటెస్టెడ్ కార్పొరేటర్లు కొత్త ప్రభాకర్ గౌడ్ , కుర్రి శివ శంకర్ గౌడ్ ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్త విక్రమ్ గౌడ్, ఏ.ఈ రాకేష్ , కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరమణపురంలో కార్పొరేటర్ రజితరెడ్డి పర్యటన


శ్రీరమణపురంలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబరు 12 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ శ్రీరమణపురం కాలనీలో బుధవారం స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి అధికారులతో కలిసి పలు అభివృద్ధి పనులు పరిశీలించారు. మున్సిపల్ డిఇ వెన్నెల గౌడ్,ఏఈ రాజ్ కుమార్,డిఈ సాయితరుణ్ తదితరులతో కలిసి ఆమె పనులు పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ శ్రీరమణపురంలో రూ.98 లక్షల వ్యయంతో స్ట్రామ్ వాటర్ డ్రైన్ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. శ్రీరమణపురం, చర్చి కాలలలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా కొత్త స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరలోనే కొత్త సిసి రోడ్లు పనులు చేపడుతామని తెలిపారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రాములు, పి రాఘవేందర్, లుకాస్, పోలిశెట్టి సుధాకర్, జానీ, బాల, బాబురావు, కాంగ్రెస్ పార్టీ నేతలు సల్ల ప్రభాకర్‌రెడ్డి, రత్నారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సత్తిరెడ్డి, పూస శ్రీనివాస్, ఉర్దురెడ్డి, హనుమంత రెడ్డి, సందీప్,భాస్కర్,సంతోష్,పాండు ,సురేష్, ఆరోగ్యమ్మ, లక్ష్మి మల్లమ్మ అంజనాదేవి పాల్గొన్నారు.

## రాంశంకర్‌నగర్‌లో డ్రైనేజీ పనులు : బండారు శ్రీవాణి


రామంతాపూర్‌లో డ్రైనేజీ సమస్య పరిశీలిస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, నవంబరు 12 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్ రాంశంకర్‌నగర్ కాలనీలో చేపడుతున్న సివరేజీ డ్రైనేజీ పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి అధికారులతో కలిసి పరిశీలించారు. జలమండలి జిఎం సంతోష్‌కుమార్, మేనేజర్ రవీందర్, ఇతర అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గతంలోఇచ్చిన హామీ మేరకు రాంశంకర్‌నగర్ వీధినెం.4లో సేవరేజ్ పైప్ లైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. రాంశంకర్‌నగర్ లోతట్టు ప్రాంతాలలో గత కొన్ని సంవత్సరాలుగా మురుగు నీటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్థానిక ఎంపి ఈటల రాజేందర్ సహకారంతో పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు బద్రీనాథ్, అనిల్‌కుమార్, రఘునాథ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## చిలుకానగర్‌లో బిసి ధర్మపోరాట దీక్ష పోస్టర్ ఆవిష్కరణ


చిలుకానగర్‌లో బిసి ధర్మపోరాట దీక్ష పోస్టర్ ఆవిష్కరిస్తున్న గజ్జెల సత్యరాజ్‌గౌడ్, భాస్కర్‌గౌడ్ తదితరులు

**ఉప్పల్, నవంబరు 12 ప్రభాతవార్త :** చిలుకానగర్‌లో బిసి సంక్షేమ సంఘం నేత గజ్జెల సత్యరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం బిసిల ధర్మపోరాట దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. గురువారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ నిర్వహించ తలపెట్టిన దీక్ష పోస్టర్‌ను స్థానిక బిసి సంఘం నేతలు గజ్జెల సత్యరాజ్‌గౌడ్, నేర్ధం భాస్కర్ గౌడ్,అంబటి జగదీష్, గోనె శ్రీకాంత్, పుప్పాల వెంకటేశ్వర్లు, కొంపల్లి బాలరాజ్, కొంపల్లి రవీందర్, తెలంగాణ సంపత్, బోద విద్యాసాగర్, కొయ్యడ ప్రసాద్ గౌడ్, చంద్రయ్య, పలుగుల యాదగిరి, హరీష్ రావు, మాటేటి కైలాసం తదితరులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బిసిల ధర్మపోరాట దీక్షకు భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బిసి సంఘం నేతలు పాల్గొన్నారు.